RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 121 బుధవారం 28 మే 2025 పేజీలు : 4

## స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు తెలుగు ప్రజలు పోరాటం చేయాలి

విశాఖపట్నం : కేంద్ర ప్రభుత్వం ముందస్తు పథకం ప్రకారమే వి శాఖ స్టీల్‌ప్లాంటు కార్మికులను తొలగిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. విశాఖలోని పార్టీ కార్యాలయం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంటులో మూడు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, తక్షణం వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు తమ డిమాండ్‌ల సాధనకు సమ్మెకు దిగితే, యాజమాన్యంతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఉద్యోగం నుంచి తొలగించినవారికి ఎలాంటి పరిహారం అందజేయకపోవడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. కాంట్రాక్టు కార్మికుల్లో నిర్వాసితులు కూడా ఉన్నారని, వారిని రోడ్డునపడేయడం అన్యాయమన్నారు.




# విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు..

## అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్: తెలంగాణలో భారీ వర్షాలు పడుతున్నాయి. ఈనేపథ్యంలో అధికారులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇవాళ(మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు తెలంగాణలో ప్రవేశించాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని చెప్పారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందించారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారిందని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించామని ప్రకటించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని అన్నారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయని తెలిపారు. 'కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలుతోనే అని దుష్ప్రచారం చేశారు. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి. కలెక్టర్లు ప్రో యాక్టివ్‌గా ఉండాలి. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి. ఒక్క నిముషం వృథా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోండి. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టండి. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. 'కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. జిల్లాలవారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియనించుకోండి. భూభారతి పేద రైతులకు చుట్టం. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయండి. జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడోదశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి. ఇందిరమ్మ ఇండ్లు చాలా కీలకం. క్షేత్రస్థాయిలో బాగా జరగాలంటే అది కలెక్టర్ల చేతిలోనే ఉంది. మండలస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలి. మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలి. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలి. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటుకు రుణాలు అందించండి. క్షేత్ర స్థాయిలో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి. 29, 30 తేదీల్లో జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలి. జూన్ 1వ తేదీ నాటికి పూర్తి నివేదిక అందించాలి. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## రాజీవ్ యువవికాసం..

## తొలి విడతలో రూ.లక్షలోపు యూనిట్లు



హైదరాబాద్: రాజీవ్ యువవికాసంపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. జూన్ 15 తర్వాత రాజీవ్ యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్ ఉంటుందని, అక్టోబర్ 2 నాటికి 5లక్షల మందికి దశలవారీగా లబ్ధి చేకూరేలా ప్రణాళిక వేసినట్లు తెలిపారు. తొలి విడతలో రూ.లక్షలోపు యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు.




# కవిత సంచలనం నిర్ణయం..

## కేసీఆర్‌కు ఏం చెప్పారంటే..!

హైదరాబాద్, మే 27: బీఆర్‌ఎస్‌లో అంతర్గత పోరు తారా స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు రావడంతో మొదలైన ఈ పొలిటికల్ సైక్లోన్.. మరింత తీవ్రంగా మారేలా కనిపిస్తోంది. ఎమ్మెల్సీ కవిత.. తన తండ్రి పార్టీని కాదని కొత్త పార్టీ స్థాపించాలని ఆలోచిస్తున్నారట. ఇదే విషయాన్ని కేసీఆర్ పంపిన దూతలకు కూడా తేల్చి చెప్పారట. అంతేకాదు.. జూన్ 2న కొత్త పార్టీపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని జాగృతి నేతలు బయట ప్రచారం చేస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. బీఆర్‌ఎస్ పార్టీలో తనకు ప్రాధాన్యత దక్కడం లేదనే అసంతృప్తితో ఎమ్మెల్సీ కవిత ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఆమె ఏ సభ, సమావేశాల్లో పాల్గొన్నా నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే విధంగానే కామెంట్స్ చేస్తూ వచ్చారు. తాజాగా బీఆర్‌ఎస్ వరంగల్ సభ తరువాత పార్టీ తీరుపై కేసీఆర్‌కే నేరుగా లేఖ రాశారు. ఈ లేఖ లీక్ అవడంతో.. తెలంగాణ రాజకీయం షేక్ అయ్యింది. ఆ తరువాత పరిణామాలు కూడా చాలా హీట్ క్రియేట్ చేశాయి. అమెరికా నుంచి వచ్చిన కవిత.. ఎయిర్‌పోర్టులోనే మీడియాతో మాట్లాడారు. ఆ లేఖ తాను రాసిందేనని కన్ఫామ్ చేసిన ఆమె.. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ బాంబ్ పేల్చారు. ఇక కవిత లేఖపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం స్పందించారు. కవితకు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు.

**దూతలతో మంతనాలు..** పరిస్థితులు చేయి దాటిపోతుండటంతో కవిత వద్దకు కేసీఆర్ తన దూతలను పంపించారు. కవిత అసంతృప్తికి గల కారణాలపై చర్చించారు. అయితే, వీరి చర్చలు సైతం విఫలమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

తనకు బీఆర్‌ఎస్ పార్టీలో ప్రాధాన్యత లేకుంటే తన దారి తాను చూసకుంటానని కేసీఆర్‌కు కవిత స్పష్టం చేశారట. కొత్త పార్టీ కూడా పెట్టే ఆలోచనలతో ఉన్నట్లు స్పష్టం చేశారట.

**జూన్ 2న కొత్త పార్టీ..** ఇదిలా ఉంటే.. కవిత బీఆర్‌ఎస్‌ను వీడి కొత్త పార్టీ పెడతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్‌ఎస్‌లో తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. ఇక ఆ పార్టీలో ఉండాలనుకోవడం లేదని ఆమె అనుచరులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కవిత వరుసగా పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని అంటున్నరు. ఇప్పటికే జాగృతిని విస్తరిస్తూ పలు కొత్త కమిటీలను కవిత ఏర్పాటు చేశారు. వరుసగా జాగృతి నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ కమిటీలను ప్రకటిస్తున్నారు. మంగళవారం నాడు సింగరేణి జాగృతి కమిటీని కవిత ప్రకటించారు. తొమ్మిది మంది కన్వీనర్లను నియమించారు. బహుజన సామాజిక న్యాయం ట్యాగ్ లైన్‌తో ప్రజల్లోకి వెళ్లాలని కల్వకుంట్ల కవిత భావిస్తున్నట్లు ఆమె అనుచరులు చెబుతున్నారు.

**ప్రతిపక్షాలు సైతం..** కవిత కొత్త పార్టీ పెడతారని.. జూన్ 2వ తేదీన కొత్త పార్టీని ఆమె ప్రకటిస్తారని ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం చెబుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో చీలిక ఖాయం అని, కేటీఆర్ నాయకత్వాన్ని కవిత అంగీకరించడం లేదంటున్నారు. ఈ కారణంగానే ఆమె సొంత పార్టీ పెట్టబోతున్నట్లు ప్రత్యర్థి పార్టీల నేతలు అంటున్నారు.




## పార్టీ కార్యకర్తల పోరాటం... త్యాగాలే ఫలితమే...

# నేటి అధికారం..

## మీ సేవలను పార్టీ ఎప్పటికీ మరువదు

## కార్యకర్తలనుద్దేశించి మహానాడులో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

కడప : ఎన్నికల్లో జనసేన, బీజేపీల సహకారం మరువలేం. కార్యకర్తల త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరించటంతో పాటు పోరాడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దశ దిశ కడప మహానాడు అని టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కడపలో టీడీపీ మహానాడు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. పార్టీ కార్యకర్తల పోరాటం, త్యాగాలే నేటి అధికారమని అన్నారు. పార్టీ పనైపోయిందన్న వాళ్ల పనైపోయింది తప్ప తెలుగుదేశం జెండా రెపరెపలాడుతూనే ఉందన్నారు. విధ్వంస పాలనలో ఎత్తిన జెండా దించకుండా పోరాటం చేసిన శ్రేణులకు వందనం.

**కడపను క్లీన్ స్వీప్ చేద్దాం..** ఎన్నికల్లో జనసేన, బీజేపీల సహకారం మరువలేం. కార్యకర్తల త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరించటంతో పాటు పోరాడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. మహానాడు వేదికగా సిద్ధాంతాలు, విధానాలు, ఆలోచనలు పంచుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం. దేవుడి గడప కడపలో జరిపే తొలి మహానాడు చరిత్ర సృష్టించబోతోంది. గత ఎన్నికల్లో కడపలో 10కి 7అసెంబ్లీ స్థానాలు గెలిచి సత్తా చాటాం. ఈసారి మరింత కష్టపడి క్లీన్ స్వీప్ చేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**బీసీలను శాసించే స్థాయికి తెచ్చాం..** దేశంలోని అనేక రాజకీయ పార్టీల్లో తెలుగుదేశం యూనివర్సిటీ నాయకులే ఉన్నారు. బీసీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి తెచ్చిన పార్టీ తెలుగుదేశం. రాజకీయాల్లో తెలుగుదేశం తెచ్చిన అతిపెద్ద విప్లవం సామాజిక న్యాయం. తెలుగుదేశం పార్టీని చూసే దేశంలోని అనేక రాజకీయ పార్టీలు బీసీలను గుర్తించటం ప్రారంభించాయి. దేశంలో కేంద్రం తీసుకున్న అనేక కీలక నిర్ణయాల్లో తెలుగుదేశం పాత్ర ఉంది. ఆంధ్రప్రదేశ్ ఈ రోజు ఆలోచించే విధానాలు దేశం రేపు ఆలోచిస్తుందనేది అనేక సార్లు రుజువైందని చంద్రబాబు అన్నారు.

**శిక్ష ఆలస్యం కావొచ్చు.. అక్రమార్కులు తప్పించుకోలేరు..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేరస్తులకు చోటు ఉండదని మహానాడు వేదికగా స్పష్టం చేస్తున్నా నని చంద్రబాబు అన్నారు. రాజకీయ అవినీతిని తెలుగుదేశం పట్టించుకోదనే అపోహ వద్దు. ఎవరు అవినీతి చేసినా కక్కించే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వానిదని చంద్రబాబు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ అవినీతిపై పారదర్శకంగా విచారణ జరుగుతోంది. అక్రమార్కులను శిక్షించే బాధ్యత ప్రజలు మనకు ఇచ్చారు. శిక్ష ఆలస్యం కావొచ్చు.. కానీ, అక్రమార్కులు తప్పించుకోలేరని చంద్రబాబు స్పష్టం చేశారు. 1989 నుంచి అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తున్నాం. అసత్య ఆరోపణలు చేయకుండా అవినీతి పరుల భరతం పట్టేవరకూ రాజీలేని పోరాటం చేసింది ఒక్క తెలుగుదేశ పార్టీయే. ఓబుళాపురం అక్రమ మైనింగ్, రాజా ఆఫ్ కరప్షన్ అంశాల్లో తెలుగుదేశం పోరాటం నిజమని న్యాయస్థానాల్లో రుజువైంది. అవినీతి పరుల భరతం పడుతూనే వచ్చే పదేళ్లలో చేపట్టే విధానాలను ఆటో పైలట్ లో పెట్టి తెలుగు జాతిని నెంబర్1 స్థానంలో ఉంచుతామని చంద్రబాబు నాయుడు అన్నారు.

# సంపాదకీయం

## కవిత డౌట్ నిజమేనా...
## బీజేపీతో బీఆర్ఎస్ ?

దేశంలో బీజేపీకి దూరంగా ఉంటే రాజకీయం చేయడం చాలా కష్టమన్న సత్యాన్ని తలపండిన రాజకీయ నేతలు ఒక్కొక్కరుగా గ్రహిస్తున్నారు. సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ అధికారంలోకి కూటమిగా కానీ వేరే విధంగా కానీ అధికారంలోకి వస్తుందన్న సూచనలు కానీ నమ్మకాలు కానీ కనిపించడం లేదు అని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఒక వ్యవస్థీకృత మైన సంస్థాగత నిర్మాణంతో పాటు ఎత్తులు వ్యూహాలు ఎన్నో అమ్ముల పొదిలో ఉంచుకున్న బీజేపీకి ఇది అక్షరాలా కలసి వస్తున్న కాలం. ఇలాంటి రోజు వస్తుందని జనసంఘ్ ఏర్పాటు నాడు ఆ పార్టీ నేతలు ఊహించి ఉండరు. కానీ అది జరుగుతోంది. ఈ నేపథ్యంలో నుంచి చూసినపుడు బీజేపీ అత్యంత బలమైన పార్టీగా దేశంలో ఉంది. దాంతో ఎన్డీయేలో కొత్త మిత్రులు చేరుతారా అన్న చర్చ సాగుతోంది. తెలంగాణాలో బీఆర్ఎస్ బీజేపీ మీద సాఫ్ట్ కార్నర్ తో ఉందని విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. మరో వైపు చూస్తే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత కూడా ఇదే విషయం తన లేఖ ద్వారా అన్యాప దేశంగా చెప్పారు అని గుర్తు చేస్తున్నారు. తెలంగాణాలో బీజేపీ నెమ్మదిగా విస్తరిస్తోంది. అదే సమయంలో తనదైన రాజకీయ వాటాను తీసుకోవడానికి సిద్ధంగా ఉంది అని అంటున్నారు. ఇక 2028లో కనుక త్రిముఖ పోటీ జరిగితే బీజేపీ కూడా మేజర్ రోల్ ప్లే చేస్తుందని విశ్లేషణలు ఉన్నాయి. దాంతో పాటుగా బీఆర్ఎస్ కి అది శాశ్వతంగా అధికారాన్ని దూరం చేసే విధంగా మారుతుందని అంటున్నారు. బహుశా ఇలాంటి ఆలోచనలు అంచనాలతోనే కేసీఅర్ బీఆర్ఎస్ రజతోత్సవ సభలో బీజేపీ మీద పెద్దగా విమర్శలు చేయకుండా కాంగ్రెస్ నే టార్గెట్ చేశారు అని అంటున్నారు. ఇక తెలంగాణాలో చూస్తే బీజేపీ తో కలసి జనసేన టీడీపీ కలసి ఎన్డీయే కూటమిని కొనసాగిస్తారు అన్న వార్తలు మొన్నటి దాకా వినిపించాయి. కానీ ఇపుడు చూస్తే టీడీపీ అక్కడ పార్టీ నిర్మాణం విషయంలో పెద్దగా ఆసక్తి చూపించడం లేదు అని అంటున్నారు. దానికి కారణం బీజేపీ నేతలు టీడీపీతో పొత్తుకు సుముఖంగా లేకపోవడమే అని అంటున్నారు. దాంతో పాటు బీఆర్ఎస్ ని ఎన్నికల వేళకు ఎలాగైనా దువ్వి తమ వైపు తిప్పుకోగలమన్న ఆలోచనలు కమలం పార్టీ నేతలకు ఉన్నాయని అంటున్నారు. దాంతోనే తెలంగాణా రాజకీయ దృశ్యం ప్రస్తుతానికి కనిపించీ కనిపించినట్లుగా ఉందని అంటున్నారు ఇక చూస్తే ప్రాంతీయంగా బలమైన పార్టీగా ఉంటూ రూరల్ బెల్ట్ లో గట్టిగా ఉన్న బీఆర్ ఎస్ అర్బన్ బెల్ట్ లో బీజేపీ పవర్ ఫుల్ గా ఉంది. ఈ రెండు పార్టీలు కలిస్తే కాంగ్రెస్ ని ఊడ్చి ఓడించగలవన్న చర్చలూ ఉన్నాయని అంటున్నారు. ఇక కేటీఆర్ ని తన రాజకీయ వారసుడిగా సీఎం గా చూసుకోవాలన్న కేసీఆర్ కూడా ఎన్నికల ముందర సంచలన నిర్ణయం ఏదైనా పొత్తుల విషయంలో తీసుకుంటారు అన్న ప్రచారం ఉంది. ఏది ఏమైనా కవిత చెప్పిన జోస్యమనాలో లేక సందేహం అనాలో అదే నిజం అవుతుందా అంటే మరో రెండేళ్ల కాలం వేచి చూస్తేనే కాని విషయం బోధపడదు అని అంటున్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులు, అధికారులతో
## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్...
### పాల్గొన్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత ఉన్నతాధికారులు...








గరుడ వార్త (జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి ) : కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, అన్ని జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, రుతుపవనాలు, వానాకాలం పంటల సాగు అంశాలపై చర్చ.వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందనిఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను నేను అభినందిస్తున్నానన్నారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారిందని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించామని, గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయని, కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయిఅనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేస్తున్నారని కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలని, కలెక్టర్లు ప్రో యాక్టివ్ గా ఉంటూ వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలన్నారు. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వలని, చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించాలని, ఒక్క నిముషం వృధా చేయకూడదు, అదేవిధంగా నిర్లక్ష్యం వహించొద్దని అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి, మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోండని సిఎం స్పష్టం చేసారు. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉందిసీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు.పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టి, నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి జిల్లాలవారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియనించుకోవాలని, భూభారతి పేద రైతులకు చుట్టం అనే విషయం ప్రజలలోకి వెళ్లాలని, అందుకు భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించి భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ఇందిరమ్మ ఇండ్లు చాలా కీలకం క్షేత్రస్థాయిలో బాగా జరగాలంటే అది కలెక్టర్ల చేతిలోనే ఉంది మండలస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలి మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలి ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలి ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటుకు రుణాలు అందించండి క్షేత్ర స్థాయిలో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలని,29, 30 తేదీల్లో జిల్లాల ఇంచార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలని సిఎం సూచించారు. జూన్ 1 నాటికి పూర్తి నివేదిక అందించాలని తెలిపారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు గౌతం, మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రసాయనిక ఎరువులు గాక సేంద్రియ ఎరువులు వాడాలి : వ్యవసాయ శాస్త్రవేత్తలు

### రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులకు సూచించిన శాస్త్రవేత్తలు





శామీర్ పేట, (గరుడ వార్త) : రైతులు రసాయనిక ఎరువుల వినియోగం వీలైనంత మేర తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేట, మందాయపల్లి గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు అధిక యూరియా, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించి భూసారాన్ని బట్టి పంటలు వేసుకోవాలని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువులైన జనుము జీలిగాలను పొలంలో దున్నుకొని భూసారాన్ని పెంచుకోవాలని చెప్పారు. భూసారాన్ని బట్టి పంటలు వేసుకుంటే అధిక దివాడలు సాధించవచ్చు అని తెలిపారు.

నాణ్యమైన విత్తనాలను విత్తుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని, వరి పంటకు బదులు కూరగాయలు పండ్లతోటలు సాగు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ లావణ్య, డాక్టర్ విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు రవి యాదవ్, సుధీర్, వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ



శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఘనంగా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అల్వాల్ ప్రాంతానికి చెందిన మంచాల రవీందర్, రమాదేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఎల్లమ్మ తల్లి



ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## హరిత లక్ష్యం ఖరారు...

సిరిసిల్ల : పచ్చదనం పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విరివిగా మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టింది. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో ప్రతి గ్రామానికి నర్సరీని ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో బహుళ ప్రయోజనాలు ఉండేలా వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. వనమహోత్సవానికి ఈ సంవత్సరం లక్ష్యాన్ని ఖరారు చేసి చలువ పందిళ్ల నీడన మొక్కలను సంరక్షిస్తున్నారు.

జిల్లాలో పన్నెండు మండలాల పరిధిలో 260 గ్రామపంచాయతీలు ఉండగా ఉపాధిహామీ ద్వారా 255 నర్సరీలు ఏర్పాటు చేశారు. గతేడాది 6,06,384 మొక్కలు నాటడం లక్ష్యంగా ఏర్పాటు చేసుకొని 84 శాతం నాటారు. ఈ ఏడాది సైతం 6,77,000 మొక్కలను నాటాలని అధికారులు లక్ష్యంగా ఏర్పాటు చేశారు. నర్సరీల నిర్వహణ, మొక్కలు నాటినప్పటి నుంచి సంరక్షణ బాధ్యతను ఉపాధిహామీ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. సుమారు 35 రకాల మొక్కలను నర్సరీల్లో పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. వేసవి నేపథ్యంలో అన్ని నర్సరీలపై పర్యవేక్షణ పెంచాలని అదికారులు ఆదేశాలు జారీ చేశారు.

**పంచాయతీలపై భారం...**

అసలే అరకొర నిధులతో నెట్టుకొస్తున్న పంచాయతీలకు మొక్కల సంరక్షణ కోసం నీడ ఏర్పాటు చేయడం అదనపు భారంగా మారింది. ఎండ తీవ్రత రోజురోజుకూ పెరగడంతో నీడ ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మెజారిటీ గ్రామాల్లో షేడ్‌నెట్లను ఏర్పాటు చేశారు. ఇటీవల ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల షేడ్‌నెట్లు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల పాత తెరలతోనే సరిపెట్టగా, మరికొన్ని చోట్ల అరకొర నీడ ఏర్పాటు చేసి చేశారు. విత్తనాలు చాలావరకు మొలకెత్తకపోవడంతో చాలాచోట్ల సంచుల్లో



అసలైన మొక్కలు కాకుండా ఇతర మొక్కలు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల వేసవి తీవ్రత కారణంగా భూగర్భజలాలు అడుగంటడంతో నర్సరీల్లో మొక్కలకు నీటిని సమకూర్చడం గ్రామ పంచాయతీలకు ఇబ్బందిగా పరిణమించింది.

**గత పొరపాట్లకు తావు లేకుండా...**

మొక్కల పెంపకంలో ప్రతీసారి సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారి వెంబడి మొక్కల పెంపకాన్ని చేపడుతుండగా సెస్ సిబ్బంది విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని తొలగించడం పరిపాటిగా మారింది. అడవుల్లో కాలానుగుణంగా ఫలసాయాన్ని అందించే మొక్కలు తక్కువగా ఉన్నాయి. అడవుల్లో ఫల సాయాన్ని అందించే మొక్కలు నాటితే వానరాలు గ్రామాల్లోకి రాకుండా కొంతమేరకు అరికట్టవచ్చు. ఔషధ గుణాలున్న మొక్కలకు ప్రాధాన్యం కల్పించాలి. గ్రామాల్లో ఇంటి ఆవరణలో పెంచుకునేందుకు నిమ్మ, దానిమ్మ, జామ, మునగ, మామిడి, పూల మొక్కలను అందిస్తే స్థానికులు ఆసక్తిగా తీసుకునే అవకాశం ఉంది. గ్రామాల్లోని అంతర్గత రహదారుల వెంబడి నీడ కరవైంది పల్లెల్లోని అంతర్గత రహదారుల వెంబడి మొక్కల పెంపకానికి ప్రాధాన్యం కల్పిస్తే వీధుల్లో పచ్చదనం సంతరించుకునే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో అనువైన స్థలాలు ఎంపిక చేసే విషయమై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## మురుగు మళ్లింపునకు అడ్డంకులెన్నో..!

వేములవాడ: ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని గుడి చెరువు ప్రక్షాళనలో భాగంగా చేపట్టిన మురుగు మళ్లింపు పనులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురుకావడంతో పనులు గత కొన్ని రోజులుగా నిలిచి పోయాయి. పట్టణంలోని కట్టుకాలువ నుంచి వచ్చే మురుగునీరు గుడి చెరువులో కలిసి నీరు కలుషితం అవుతుండటంతో ఈ మురుగునీటి మళ్లింపు పథకానికి అధికారులు రూప కల్పన చేశారు. ఇందుకు ప్రభుత్వం రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో గత రెండు నెలల క్రితం పైపులైన్ నిర్మాణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. దాదాపు 2.3 కిలో మీటర్ల పొడవునా పనులు చేయాల్సి ఉంది. మొదటి బైపాస్ రహదారి నుంచి ఆలయ పార్కింగ్ ప్రాంతం మీదుగా వీఐపీ రోడ్డు వరకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. భగవంతరావునగర్ నుంచి న్యూఅర్బన్ కాలనీ వరకు పైపులైన్ వెళ్లే ప్రాంతంలోని గుడి చెరువు ఎఫ్‌టీఎల్ బాధితులు పలుమార్లు అభ్యంతరం చెప్పడం, అడ్డుకోవడంతో పనులకు ఆటంకం ఏర్పడింది.

**ఎఫ్‌టీఎల్‌లో భారీగా ఆక్రమణలు**

గుడి చెరువులో భారీగా ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) ప్రాంతాన్ని కొంత మంది ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించారు. చాలా ఏళ్ల క్రితమే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు హద్దురాళ్లను ఏర్పాటు చేసినప్పటికీ హద్దులు తొలగించి కొందరు అక్రమార్కులు ఎఫ్‌టీఎల్‌లో ప్లాట్లుచేసి విక్రయించారు. పలువురు భవనాలు సైతం నిర్మించారు.



ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పుడు ఇది సమస్యకు దారి తీసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. డబ్బులు వెచ్చించి పాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిఏటా వర్షాకాలంలో మల్లారం మూలవాగు మత్తడి నుంచి భీమేశ్వర ఫీడర్ ఛానల్ ద్వారా వచ్చే వాననీటితో పాటు న్యూఅర్బన్ కాలనీ, భగవంతరావునగర్ ప్రాంతాల వైపు నుంచి వచ్చే మురుగునీరు కట్టుకాలువ ద్వారా పారుతూ గుడి చెరువులో కలుస్తోంది. దీంతో గుడి చెరువులోని నీటిని స్థానికులు, భక్తులు వినియోగించడానికి వీలు లేకుండా పోతోంది. దీనిని ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో మురుగు మళ్లింపు పనులకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు పూర్తయితే గుడి చెరువునీరు కలుషితం అయ్యే అవకాశం లేదు. **త్వరలో పనుల మొదలు–అన్వేష్, మున్సిపల్ మిషనర్ వేములవాడ** మురుగు నీరు మళ్లింపు పైపులైన్ నిర్మాణం పనులు రెండు మూడు రోజుల్లో మొదలవుతాయి. ఒకరిద్దరు వ్యక్తులు పైపులైన్ నిర్మాణ పనులకు అభ్యంతరం తెలిపారు.. నిబంధనల మేరకు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించిన హద్దుల ప్రకారమే పైపులైన్ నిర్మాణ పనులు చేపడతాం.

# కలగా.. ప్రయోగశాల!

నర్సాపూర్: పశువులకు సోకే వ్యాధుల నిర్ధారణకు నర్సాపూర్‌లో ప్రయోగశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లోనే రూ.15 లక్షలతో భవనాన్ని నిర్మించారు. రూ.10 లక్షల విలువైన పరికరాలను సమకూర్చినా, ఇంతవరకు ప్రారంభానికి నోచలేదు. మూగజీవాలకు వివిధ రకాలైన రోగాలు సోకి మృత్యువాత పడుతుంటాయి. దీంతో పెంపకందారులు నష్టపోతున్నారు. వ్యాధి విషయం ముందుగానే తెలుసుకుంటే, అవసరమైన నివారణ చర్యలు తీసుకునే వీలుంటుందని, ప్రయోగశాలను ఏర్పాటు చేసి, 2018 అక్టోబరు 2న ప్రారంభించాలనుకున్నా, వాయిదా వేశారు.

**ఎనిమిదేళ్లు గడిచిపోతున్నా..:** జిల్లాల పునర్విభజనకు ముందు 18 మండలాలతో నర్సాపూర్‌లో పశుసంవర్ధకశాఖ డివిజన్ కార్యాలయం కొనసాగేది. గతంలోనే ఇక్కడ ప్రయోగశాల ఏర్పాటు చేయాలని యోచించారు. పునర్విభజనలో నర్సాపూర్ నుంచి డివిజన్ కార్యాలయం తరలిపోయింది. ఒకే మండలంతో ఇక్కడ పశు సంవర్ధకశాఖ కార్యాలయం, ఆసుపత్రి కొనసాగిస్తున్నారు. జిల్లాలోని 2.90 లక్షల పశు సంపద అవసరాలను గుర్తిస్తూ పశువుల వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల ఏర్పాటుకు ఎనిమిదేళ్ల కిందట పక్కా భవనం, అన్నిరకాల వసతులు



కల్పించారు. అయినా నిరుపయోగంగా ఉన్నాయి.

**దుమ్ము పడుతున్న పరికరాలు..**

పశువుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేసే యంత్రం ఇంకా అట్టపెట్టెలోనే ఉంది. మిగతా పరికరాలు వృథాగా మారాయి. ప్రయోగశాల ఏర్పాటైతే పశువుల పెంపకందారులు ప్రయోగాలకు సంగారెడ్డికి వెళ్లే అవసరం ఉండదని ఆశాఖ అధికారులే పేర్కొంటున్నారు. మందులు కూడా ఇక్కడే ఇచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ప్రయోగశాల ఏర్పాటుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తాం: డాక్టర్ వెంకటయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నర్సాపూర్‌లో రోగ నిర్ధారణ ప్రయోగశాలకు అనుమతి రావాల్సి ఉంది. సిబ్బందిని నియమించాలి. కొత్తగా జిల్లాలో ప్రయోగశాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. భవనాన్ని 108 సిబ్బందికి అప్పగించాం.

# కర్షకుల సహకారం.. ముందుకొస్తే సాకారం

జహీరాబాద్: రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో చెరకు పంట సాగుచేసే ప్రాంతంగా జహీరాబాద్‌కు గుర్తింపు ఉంది. ఇక్కడి చక్కెర కర్మాగారం మూతపడటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయారు. అందుకే రైతుల భాగస్వామ్యంతో సహకార చక్కెర కర్మాగారం ఏర్పాటుకు వంద ఎకరాల భూమిని కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం జహీరాబాద్‌లో జరిగిన ప్రజాపాలన.. ప్రగతిబాట బహిరంగ సభలో ప్రకటించారు. సీఎం ప్రకటనపై స్థానిక రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

**పొరుగు రాష్ట్రాల్లో అమలు**

తెలంగాణకు పొరుగునే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల్లో అత్యధిక చక్కెర కర్మాగారాలు రైతుల భాగస్వామ్యంతో కొనసాగుతున్నాయి. రైతులు సంఘంగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. కర్మాగారం ఏర్పాటుపై ఈ సంఘం ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదించాలి. దీంతో ప్రభుత్వం ఉన్నతాధికారులతో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి.. స్థానికంగా చక్కెర కర్మాగారం స్థాపనకయ్యే పెట్టుబడి, భాగస్వామ్య రైతుల వివరాలు, వారి వాటా, బ్యాంకు రుణం తదితర అంశాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది. వివరాలన్నీ సజావుగా ఉంటే.. ప్రభుత్వం ఉచితంగా స్థలాన్ని కేటాయిస్తుంది. ఈ స్థలంలో పరిశ్రమను స్థాపించాలి. వచ్చే లాభాల నుంచి బ్యాంకు రుణాలు చెల్లించాలి. రైతులకు లాభాల్లో వాటాను పంచాలి. ప్రస్తుతం మహారాష్ట్రలో అమలవుతున్న పద్ధతులు బాగున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**రూ.200 కోట్లు అవసరం**

ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రకారం నిమ్జ్ పరిధిలో 100 ఎకరాల భూమిని కేటాయిస్తే.. కర్మాగారం స్థాపనకు సుమారు రూ.200 కోట్ల పెట్టుబడి అవసరమని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన బ్యాంకు రుణం రూ.100 కోట్లు, మరో రూ.100 కోట్లు రైతులు వాటా ధనం చెల్లించాల్సి ఉంటుంది.



**జహీరాబాద్ ప్రాంతం అనుకూలం**

గతంలో జహీరాబాద్ జోన్ పరిధిలోకి జహీరాబాద్, ఝరాసంగం, మొగుడంపల్లి, కోహీర్, న్యాల్‌కల్, రాయికోడ్, మనూరు, రేగోడ్, వట్‌పల్లి మండలాలు ఉండేవి. గతేడాది రాయికోడ్ మండలం మాటూర్‌లో ఏర్పాటైన పరిశ్రమ పరిధిలోకి విలీనం చేసిన న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, రాయికోడ్, రేగోడ్, వట్‌పల్లి మండలాల్లో ప్రస్తుతం 3,600 హెక్టార్లలో చెరకు సాగవుతోంది. సుమారు 3.50 లక్షల టన్నుల చెరకు ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం నాన్‌జోన్ పరిధిలోని(ఏ పరిశ్రమ కిందకు కేటాయించనివి) జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో 4,521 హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నారు. సుమారు 4.5 లక్షల టన్నుల చెరకు ఉత్పత్తి అవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో కర్మాగారం స్థాపనకు అనువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

# డబ్బులివ్వండి.. లీగ్‌లో ఆడండి.. యువ ఆటగాళ్లకు రూ.లక్షల్లో టోపీ



హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)పై ఇప్పటివరకు ఉన్న అవినీతి, అక్రమాల ఆరోపణలు చాలవన్నట్లు.. ఇప్పుడు క్లబ్‌ల కార్యదర్శులు తమ జట్ల తరఫున ఆడేందుకు లక్షల్లో డబ్బులు వసూలు చేస్తుండటం హైదరాబాద్ క్రికెట్ భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. ఎ-డివిజన్ మూడు రోజులు, రెండ్రోజుల లీగ్‌లలో ఆడేందుకు ధరల పట్టికను నిర్ణయించి మరీ ఆటగాళ్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు క్లబ్‌లను లీజుకు ఇస్తుండగా.. మరికొందరు నేరుగా ఆటగాళ్ల దగ్గరే డబ్బులు తీసుకొని ఆడించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో క్రికెట్ అకాడమీలు నడుపుతున్న కోచ్‌లు ఆయా జట్లను లీజుకు తీసుకునేందుకు లక్షలు చెల్లిస్తున్నారు. అనంతరం ఆటగాళ్ల దగ్గర భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఒక సీజన్‌లో మూడు రోజుల లీగ్ జట్టుకు రూ.20 లక్షలు, రెండ్రోజుల లీగ్ జట్టుకు రూ.10 లక్షలుగా లీజు ధర క్రికెట్ మార్కెట్లో ఉంది. లీజు తీసుకుంటున్న సదరు కోచ్‌లు ఒక్కో ఆటగాడి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ అండర్-19, అండర్-23, రంజీ ట్రోఫీ జట్ల ఎంపికకు ఈ లీగ్స్ ప్రదర్శనే ప్రాతిపదిక.

**ఆటగాళ్ల దగ్గరే వసూళ్లు**

మ్యాచ్‌ల షెడ్యూల్ ఇంకా ఖరారే కాలేదు. మునుపటి మాదిరే 37, 90 జట్లతో ఈ ఏడాది 3, 2 రోజుల లీగ్స్ నిర్వహించాలని హెచ్‌సీఏ భావించడంతో ఆయా జట్లు ఫీజులు చెల్లించడం మొదలుపెట్టేశాయి. కొన్ని క్లబ్‌లు జట్లను లీజుకిస్తుండగా.. మరికొన్ని నేరుగా ఆటగాళ్ల దగ్గరే డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

"లీగ్స్‌లో ఆడేందుకు కొందరు డబ్బులు తీసుకుంటున్నట్లు ఫిర్యాదు వచ్చింది. జూన్ మొదటి వారంలో లీగ్స్ ప్రారంభమవుతాయి. లీగ్స్ మొదలయ్యాక, మధ్యలో ఎప్పుడైనా.. ఎవరైనా ఎలాంటి ఫిర్యాదు చేసినా సదరు క్లబ్‌పై కఠిన చర్యలు తీసుకుంటాం"

దేవరాజ్, హెచ్‌సీఏ కార్యదర్శి

"మూడు, రెండ్రోజుల లీగ్‌లో ఉన్న జట్లను లీజుకిస్తున్న క్లబ్‌లపై చర్యలు తీసుకోవాలి. కొందరు క్లబ్ కార్యదర్శులు క్రికెట్‌ను వ్యాపారంగా మార్చుకున్నారు. దీనిపై ప్రభుత్వం, పోలీసులు విచారణ జరపాలి. పేద, మధ్య తరగతి, గ్రామీణ ప్రతిభావంతులకు ఉచితంగా 3, 2 రోజుల మాచ్‌లు ఆడే అవకాశం కల్పించాలి."

శేష్ నారాయణ, హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి

# మూడు నెలల కోటా.. ముందస్తుగానే



రామడుగు : ఒకేసారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీకి అధికారులు బియ్యం రవాణాను ప్రారంభించారు. మండల స్థాయి నిల్వల కేంద్రం నుంచి రేషన్ దుకాణాలకు రవాణాను శనివారం ప్రారంభించారు. సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతుందని అధికారులు అంచనావేశారు. దీనికి అనుగుణంగా పూర్తిస్థాయి నిల్వలు ఉన్నట్లు తెలిపారు. వచ్చే నెలాఖరులోగా మండల స్థాయి నిల్వల కేంద్రం నుంచి జిల్లాలోని రేషన్ దుకాణాలకు పంపిణీ చేయడానికి నిర్దేశించారు.

**ఒకేసారి పంపిణీతో లాభాలివే..**

ఒకే సారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదేశించింది. రవాణా సమస్యలతోపాటు.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలో సన్న రకాలు ఇస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి మూడు నెలలకు సరిపడా బియ్యం పంపిణీ చేయడం ద్వారా రవాణా ఛార్జీల ఖర్చు తగ్గనుండటంతోపాటు.. డీలర్లు, హమాలీ కూలీ కలిసొచ్చే అవకాశముంది. ఇందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసుకొంది. ప్రస్తుతం భారీ మొత్తంలో రవాణా చేసేందుకు వారి వద్దనున్న వాహనాలతో సాధ్యమేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరో వైపు స్థలాభావం సమస్య తెరపైకి వస్తోంది. ఈ సమస్యను అధికారులు ఎలా అధిగమిస్తారో చూడాల్సి ఉంది.

**నిల్వ సామర్థ్యంపై ఆందోళన**

ఒక్కో దుకాణంలో సుమారు 300 క్వింటాళ్ల బియ్యం నిల్వ చేసే సామర్థ్యం మాత్రమే ఉంది. జిల్లాలో 566 రేషన్ దుకాణాలుంటే 2,83,152 కార్డులున్నాయి. ప్రతినెలా 5,917.854 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ చేయాల్సి వస్తే.. 17,753.562 మెట్రిక్ టన్నులను సరఫరా చేయాల్సి ఉంటుంది.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభించే నాటికి జిల్లాలో ఏడు నెలలకు సరిపడా 35 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో సామర్థ్యం పెంచేందుకు ఏం చేయాలో అధికారులకు పాలుపోవడంలేదు.

**ఏర్పాట్లు చేస్తున్నాం**

ప్రభుత్వం మూడు నెలల కాలానికి ఒకేసారి పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నాం. జూన్ 30 లోగా పంపిణీ చేయాలని ఆదేశాలున్నాయి. ప్రభుత్వం విధివిధానాలు, మార్గదర్శకాలు జారీ చేయనప్పటికీ పంపిణీకి కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. నర్సింగరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

# అన్నదాత ఆశలకు మొలకలు



రామడుగు: వానాకాలం ముంచుకొస్తున్నా.. యాసంగిలో పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు అరిగోస పడుతున్నారు. కేంద్రాల్లో నెల రోజులు గడిచినా తూకంలో తీవ్ర జాప్యంతో అకాల వర్షాలకు వరి ధాన్యం తడిసి ముద్దవుతోంది. వాటికి మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గంగాధర మండలం కోట్ల నర్సింహులపల్లిలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం ప్యాక్స్ కేంద్రంలో దాదాపు 30 మంది రైతులకు చెందిన 7 లారీల ధాన్యం తూకం చేయాల్సి ఉండగా హమాలీల సమస్యతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. నాలుగు రోజులుగా వర్షాలకు కురవడంతో వరి ధాన్యం తడిసి మొలకెత్తిందని రైతులు సామాజిక మాధ్యమాల ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు.

**వరద ప్రవహించి..**

కుప్పల కిందకు వర్షం నీరు ప్రవహించి మొలకలు రాగా వరినారు తలపించింది. తూకం వేసిన బస్తాలు అడుగు భాగాన తడిసిపోగా ఎండలో వేసి ఆరబెట్టారు. లక్ష్మీదేవిపల్లి నుంచి రెండు హమాలీ బ్యాచ్‌లను తెప్పించినట్లు, మూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తామని ప్యాక్స్ కార్యదర్శి రమేష్ తెలిపారు. ర్యాలపల్లిలో తూకం వేసిన బస్తాలు తరలించకపోవడంతో కేంద్రంలోనే తాటిపత్రిలు కప్పి నెట్ కొట్టి నిల్వ ఉంచారు. ర్యాలపల్లిలో నాలుగు లారీలు, కొండాయపల్లిలో అయిదు లారీల ధాన్యం తూకం వేయాల్సి ఉంది. రంగారావుపల్లిలోనూ హమాలీల సమస్యతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఇంకా నాలుగు రోజులు పట్టేలా ఉంది. రామడుగు మండలం వన్నారంలోని కేంద్రంలో వర్షం నీరు నిలిచి లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా మారింది.

**వడ్లు పోసి 40 రోజులైంది**

రెండెకరాల్లో వరిపొలం కోసి 40 రోజులు గడిచినా తూకం వేయడం లేదు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ధాన్యం కుప్పలపై తాటిపత్రిలు కప్పి ఉంచినా అడుగు భాగానా నీరు వెళ్లి మొలకలు వచ్చాయి. హమాలీల సమస్యతో కేంద్రం నిర్వాహకులు జాప్యం చేస్తున్నారు. మొలక వచ్చిన ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

**మా గోస పట్టేదెవరికి?**

కేంద్రంలో వడ్లు పోసి ఇబ్బందులు పడుతున్నాం. వర్షానికి ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. వాటిని ఆరబెట్టేందుకు అరిగోస పడుతున్నాం. మాకు జీవనాధారమే వ్యవసాయం.. అలాంటిది సకాలంలో వడ్లు తూకం వేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

# విస్తరణ అస్తవ్యస్తం

చేర్యాల: చేర్యాల పట్టణం మీదుగా వెళ్తున్న సూర్యాపేట-సిరిసిల్ల 365బీ జాతీయ రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. రెండేళ్లు దాటినా పనులు పూర్తి కాలేదు. ముఖ్యంగా పట్టణం పొడవునా అక్కడక్కడ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పట్టణవాసులకే కాకుండా చుట్టుపక్కల ఉన్న మద్దూరు, ధూల్మిట్ట, కొమురవెల్లి, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాల నుంచి వివిధ పనుల కోసం చేర్యాలు వచ్చే ప్రజలు, వాహనదారులు నానా తిప్పలు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం చేసిన సర్వే ప్రకారమే జాతీయ రహదారిపై నిత్యం సుమారు 5 వేల వాహనాలు వెళ్తున్నట్లు అంచనా. పట్టణంలో రహదారికి ఇరువైపులా సుమారు 4 కిలోమీటర్ల దూరం విస్తరణలో 32 చోట్ల పనులు అసంపూర్తిగా వదిలేశారు. రహదారితో పాటు



మురుగు కాలువలో 15 చోట్ల మధ్యలో విద్యుత్తు స్తంభాలు తొలగించలేదు. రహదారికి ఇరువైపులా అసంపూర్తి కాలువలతో మురుగు నీరు సాఫీగా ప్రవహించడం లేదు. నివాసాలు, దుకాణాల ఎదుటే మురుగు రెండేళ్లుగా నిల్వ ఉండటంతో చెత్తాచెదారం చేరి కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది.

**పునాది దశలో వంతెన**విస్తరణలో భాగంగా గాంధీ కూడలిలో వంతెన నిర్మాణం నెమ్మదిగా సాగుతోంది. పాత బ్రిడ్జిని పూర్తిగా ధ్వంసం చేశారు. ముందుగా ఒక వైపు వంతెన పనులు పూర్తి చేసి రెండో వైపు మొదలుపెట్టారు. దాదాపు ఆరు నెలలుగా పునాది దశలోనే ఉంది. రానున్నది వర్షకాలం. పెద్దచెరువు మత్తడి దూకిన నీరు, కడవేర్గు రహదారి వైపు నుంచి వచ్చే వరద, పట్టణంలోని 5, 6, 7, 8, వార్డుల నుంచి వచ్చే వరద ఈ వంతెన కింది నుంచే కుడి చెరువులోకి చేరుతుంది. ఆరు నెలలుగా నత్తనడకన సాగుతున్న పనులతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**ఆటంకం కలుగుతోంది: నాగేందర్, కమిషనర్**

విస్తరణతో బల్దియా పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. రహదారి ఇంజినీర్లతో మాట్లాడి త్వరగా పూర్తయ్యేలా చూస్తాం. పట్టణ వాసుల ఇబ్బందులు తొలగిస్తాం.

# వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డులు

గజ్వేల్ : అధిక వడ్డీ రుణాల భారం నుంచి వీధి విక్రయదారులకు విముక్తి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020 జూన్‌లో ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి(పీఎం స్వనిధి) యోజనను ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు మూడు దశల్లో తక్కువ వడ్డీతో స్వల్పకాలిక రుణాలిచ్చింది. ఈ ప్రక్రియను గతేడాది కేంద్రం నిలిపివేసింది. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను కూడా మూసివేసింది. దీంతో ఆందోళన వ్యక్తమవుతున్న వేళ వ్యాపారులకు ఆత్మనిర్భర్ నిధి పథకం కింద క్రెడిట్ కార్డులు ఇచ్చేందుకు నిర్ణయించింది.

**మూడు విడతల్లో రూ.36.33 కోట్ల రుణాలు**

ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజనను కేంద్రం పట్టణాల్లోనే అమలు చేసింది. ఎంపిక చేసిన వ్యాపారులకు తొలి విడతలో రూ.10 వేలు,



రెండో విడతలో రూ.20 వేలు, మూడో విడతలో రూ.50 వేల చొప్పున రుణాలిచ్చింది. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్ పురపాలికల్లో మొత్తం 12,626 మంది వ్యాపారులకు రూ.36.33 కోట్ల రుణాలు అందజేసింది. ఆత్మనిర్భర్ నిధి పథకానికి ఐదేళ్లు పూర్తి కావడంతో తాత్కాలికంగా నిలిపివేసినట్లు మెప్మా అధికారులు చెబుతున్నారు.

**వాయిదాలు చెల్లించిన వారికి గుర్తింపు**రుణాలు తీసుకున్న వీధి వ్యాపారుల్లో బ్యాంకుకు ప్రతి నెలా సకాలంలో వాయిదాలు చెల్లించిన వారిని గుర్తిస్తారు. వీరికి త్వరలో నాలుగో విడత కింద క్రెడిట్ కార్డులు పంపిణీ చేస్తారు. కార్డు రుణ పరిమితి విలువ ఎంత ఉంటుందన్న విషయమై స్పష్టత రాలేదు. కార్డులు పొందే వ్యాపారులు తమకు అవసరం ఉన్నప్పుడే కావాల్సినంత సొమ్ము డ్రా చేసుకోవచ్చు. అవసరమైన వస్తువులు కొనుగోలు చేయొచ్చు. బిల్లు వచ్చాక నిర్దేశించిన సమయంలో తీసుకున్న రుణం చెల్లించాల్సి ఉంటుంది. మళ్లీ అవసరమైతే కావాల్సిన మొత్తం తీసుకోవచ్చు. ఇందుకు సంబంధించి త్వరలో పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉంది.

# పల్లె రమ్మంటోంది.. మట్టి పరిమళం కోసం..!

నాంపల్లి : దేశానికి పల్లె సీమలే పట్టుగొమ్మలు.. భావిపౌరులు పల్లె తల్లి ప్రేమను రాగాలను చూసేందుకు వేసవి సెలవులు నెలవులు కావాలి. విద్య, ఉద్యోగ, వ్యాపార, జీవనోపాధిరీత్యా గ్రామాల నుంచి తరలివెళ్లడం నేటి కాలంలో పరిపాటి. విద్యాభ్యాసం చేస్తున్న వారికి వార్షిక పరీక్షలు ముగిసి వేసవి సెలవులు కొనసాగుతున్నాయి. పుస్తకాలతో కుస్తీలు పట్టిన చిట్టి చేతులు మట్టి పరిమళాలు అందిపుచ్చుకునేందుకు పల్లెబాట పడితే నేర్చుకునే కొత్త విషయాలెన్నో. ఇన్నాళ్లు పట్టణాలు, నగరాల్లో యాంత్రిక జీవనానికి అలవాటు పడిన పసి మనసులు కొత్త ప్రపంచంలో విహరించేందుకు సెలవులు ఎంతో తోడ్పాటునిస్తాయి.

సమష్టి జీవనం.. శ్రమైక సౌందర్యం..పల్లె జీవన విధానం పట్టణ జీవనానికి భిన్నంగా ఉంటుంది. గ్రామీణ వాతావరణంలో వ్యవసాయం, చేతి వృత్తులు, విభిన్న ఆచారాలు సంప్రదాయాలకు నెలవై ఉంటాయి. గ్రామాల్లో పండగలు, ఉత్సవాలను కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా జరుపుకొంటారు. సమష్టితత్వం గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబిస్తుంది. సాటివారికి కష్టం వచ్చినప్పుడు సాయం చేసుకుంటూ మనోధైర్యం నింపుతారు. చిన్నారులు పల్లెల్లో విహరిస్తే ఇక్కడి జీవన విధానంపై అవగాహన పెరుగుతుంది. ప్రకృతి సోయగం..గ్రామీణ ప్రాంతాలు ప్రకృతి సోయగానికి ప్రతిరూపాలు. సూర్యోదయం.. సూర్యాస్తమయం.. పచ్చని పైర్లు.. పొంగిపొర్లే జలాశయాలు.. పక్షుల కిలకిలారావాలు.. మామిడి తోటలు..ముంజకాయలు.. ఈత పండ్లు ఇలా ప్రతి దృశ్యం పల్లె సీమ అందాలతో కనువిందు చేసేలా ఉంటుంది. చిన్నారులు ప్రకృతి అందాలను ఆస్వాదించి జ్ఞాపకాలను మదిలో నిలుపుకొనే అవకా శముంటుంది.

**పంటల సాగుపై అవగాహన..**

తినే అన్నం మొదలు ప్రతి పంటల సాగుపై చిన్నారులకు పల్లె సందర్శన ద్వారా అవగాహన పెరుగుతుంది. చిన్నారులకు వ్యవసాయంపై అవగాహన పెంపొందించడానికి పల్లె సీమలే వేదికలు. గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శింపజేస్తే రోజూ ఇంట్లో వండి వడ్డించే వరి, ఆకుకూరలు, కూరగాయలతోపాటు సేంద్రియ సాగు విధానాలు, ప్రయోజనాలు, ప్రస్తుతం వ్యవసాయంలో చోటుచేసుకుంటున్న ఆధునిక పరిజ్ఞానం వంటివి చిన్నారులు తెలుసుకుంటారు.

**ఆప్యాయత, ఆత్మీయతల కలబోత..**పల్లెటూరు అంటేనే ఆప్యాయత, ఆత్మీయత, అనురాగం తొణికిసలాడుతుంది. కులాలు, మతాలకు అతీతంగా వరుసలతోనే పిలుచుకుంటారు. పట్టణాల్లో అంకుల్.. ఆంటీల పిలుపులకు భిన్నమైన అనుబంధాలు ఇక్కడ పెనవేసుకొని ఉంటాయి. ఎవరిని ఎలా పరిచయం చేసుకోవాలి అనే విషయం చిన్నారులకు ఇక్కడే బోధపడుతుంది.

## హద్దుమీరి.. హద్దులు చెరిపి

హైదరాబాద్ : నిన్న మొన్నటి దాకా హెచ్‌సీయూ వివాదం సుప్రీంకోర్టులో కొనసాగింది. పచ్చని చెట్లను ధ్వంసం చేయడంతో కోర్టు అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. మళ్లీ మొక్కలు నాటాలని ఆదేశించింది. ఈ సంఘటనతోనైనా మేడ్చల్‌జిల్లా అటవీశాఖ అధికారులు జాగ్రత్త పడకపోగా..యథేచ్ఛగా అటవీ భూమిలోకి చొరపడే అవకాశాన్ని కొంతమందికి కల్పించింది. వివాదాస్పదమైన భూమిలో చెట్లను నరికినా..అబ్బే అదేం వివాదం కాదు.. మేమే ఆ పని చేయించామని చెబుతున్నారు. ఇది మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలోని అటవీ భూముల్లోనే జరిగింది. కొద్ది రోజులుగా అటవీ భూమిని ఆక్రమించేందుకు చెట్లను నరకేస్తున్నారనే ఫిర్యాదులు అధికారులకు వెళ్తున్నా దృష్టి సారించకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది.

**ఇంత జరుగుతున్నా...:** శామీర్‌పేట్ బాహ్య వలయ రహదారికి ఆరు



కిలోమీటర్ల దూరంలోని పొన్నాల గ్రామ పరిధిలోని అటవీభూములు సర్వే నంబరులో 130లో 240 ఎకరాలున్నాయి. దీనికి సమీపంలోనే కొంతమంది పట్టాభూములున్నాయి. వాళ్లే ఈ అటవీభూముల్లో తమకు సంబంధించిన పదెకరాల భూమి ఉందని అటవీశాఖ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఆ శాఖలోని కొంతమంది అధికారుల సహకారంతోనే మూడురోజులుగా కొందరు జేసీబీతో దాదాపుగా మూడు మీటర్ల వెడల్పులో కిలోమీటరు దూరం అడ్డంగా ఉన్న చెట్లను నరికేశారు. స్థానికుల ఫిర్యాదుతో శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి.. సిబ్బందిని పంపించి జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. రూ.20వేల జరిమానా విధించారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు మేమే చేయాలని చెప్పామని ఫోన్ చేసి చెప్పారు. లిఖితపూర్వకంగా లేఖ ఇవ్వాలని కోరితే మాత్రం ఇంతవరకు ఇవ్వలేదని తహసీల్దార్ తెలిపారు. ఈ భూమిలో సర్వే చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదన్నారు.

**సంయుక్త సర్వే**

కొద్దిరోజుల క్రితం రెవెన్యూ అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించాం. అందులోనూ స్పష్టత రాకపోవడంతో మూడురోజుల క్రితం లైన్ సర్వే చేసేందుకు జేసీబీతో చదును చేయించామని ఫారెస్ట్ రేంజర్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎక్కడా చెట్లు నరికివేయలేదని, ముళ్లకంపలు, పొదలు మాత్రమే తొలగించామని వివరించారు.

## భూ భారతి అమలుకు యంత్రాంగం సన్నద్ధం

సిరిసిల్ల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూ-భారతి పేరుతో కొత్త రెవెన్యూ చట్టం-2025 తీసుకొచ్చింది. జిల్లాలో రుద్రంగి పైలెట్ మండలంలోనే కాకుండా మిగతా రెవెన్యూ గ్రామాల్లోనూ నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. రుద్రంగి మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు ఉన్న రైతుల నుంచి 1253 దరఖాస్తులను స్వీకరించింది. ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిశీలన జరుగుతోంది. సమస్యల స్థాయిని బట్టి మండల, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తారు. జిల్లాలో రెవెన్యూ డివిజన్లు 02, మండలాలు 13, రెవెన్యూ గ్రామాలు 171 ఉన్నాయి. ఈనెల 16న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవగాహన సదస్సులో పాల్గొని పలు అంశాలను వివరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్-2న భూ-భారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ముందు క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి పలు చర్యలు తీసుకుంటున్నారు.

**నేడు జీపీవోల నియామకానికి అర్హత పరీక్ష**



ప్రస్తుతం గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు లేరు. మండల కేంద్రాలకే పరిమితమయ్యారు. జిల్లాలో 172 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటికి జీపీవో (గ్రామ పరిపాలనాధికారి)ని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రెవెన్యూ విభాగంలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్ఏలు ఇతర శాఖలకు వెళ్లారు. వీరిలో తిరిగి రెవెన్యూశాఖకు వచ్చేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా 85 దరఖాస్తులు రాగా అందులో అర్హులైన 64 మందికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. దీనిలో అర్హత సాధించిన వారిని జీపీవోలుగా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని తర్వాత మిగతా ఖాళీల భర్తీకి కొత్తగా నోటిఫికేషన్ వేస్తారా? ఉన్నవారినే డిప్యూటేషన్‌పై నియమిస్తారా అన్న విషయం తేలాల్సి ఉంది. మరోవైపు గ్రామాల్లో భూతగాదాల పరిష్కారానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నారు. ఆసక్తి ఉన్న కొత్తవారికి శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**అసైన్డ్ కమిటీల ఏర్పాటు**

ప్రభుత్వ భూముల పంపిణీ, అర్హుల ఎంపికకు గతంలో స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షతన అసైన్డ్ కమిటీలు ఉండేవి. గత ప్రభుత్వంలో ఈ కమిటీలు లేవు. భూ-భారతి చట్టంలో అసైన్డ్ భూముల సమస్యలు ఎక్కువే ఉంటున్నాయి. ప్రభుత్వ భూములను అసైన్డ్ చేసినట్లుగా పట్టాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం భూములు లేవు. కొన్నిచోట్ల హద్దులు చూపించలేదు. అసైన్డ్ కమిటీలను పునరుద్ధరించి శాస్త్రీయంగా సర్వే నిర్వహించి సాగుచేసుకుని జీవనం సాగిస్తున్న వారికే ప్రభుత్వ భూములను అసైన్డ్ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనిలో భాగంగా త్వరలో నియోజకవర్గానికి ఒక అసైన్డ్ కమిటీని నియమించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భూ-భారతి చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రత్యేక నిబంధనలు ఉండటంతో అర్జీదారుల్లో ఆశలు చిగురించాయి. తెల్లకాగితాలపై రాసుకుని కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణ కేసుపై కోర్టులో స్టే ఉంది. తీర్పువచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లోని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# మోసగాళ్లకు మ్యాట్రి'మనీ'



హైదరాబాద్: కలకాలం తోడుండాల్సిన జీవిత భాగస్వామి అర్ధాంతరంగా తనువుచాలిస్తే ఆ వేదన వర్ణనాతీతం. ఇలాంటి పరిస్థితుల్లో మరో తోడు కోసం ఎదురుచూస్తున్న మహిళలే లక్ష్యంగా కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో రిజిస్ట్రేషన్ చేసుకొని కొత్త జీవితం ప్రారంభిద్దామంటూ వంచిస్తున్నారు. నకిలీ ప్రొఫైళ్లతో నమ్మించి.. రూ.కోట్లు కాజేస్తున్నారు. మోసపోయిన వారిలో ఒంటరి మహిళలే ఎక్కువగా ఉండటం గమనార్హం.

**అచ్చం అలాంటి నేపథ్యంతో**

భాగస్వామిని కోల్పోయి, విడిపోయి దూరంగా ఉంటున్న వారు పిల్లల భవిష్యత్తు, ఒంటరిగా ఉండలేక రెండో వివాహానికి సిద్ధమవుతుంటారు. వీరి పరిస్థితుల్ని అవకాశంగా తీసుకుంటున్న మోసగాళ్లు. అచ్చం అలాంటి నేపథ్యంతో ప్రొఫైళ్లు సృష్టిస్తున్నారు. ఎవరైనా వివాహ ప్రతిపాదన పెడితే స్పందించి.. మోసం మొదలు పెడుతున్నారు.

**విదేశీ సంబంధం అమ్మో..!**

సాధారణంగా విదేశీ సంబంధాలంటే యువతుల తల్లిదండ్రులు ఆసక్తి ప్రదర్శిస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వారికి నచ్చే రీతిలో నకిలీ ప్రొఫైళ్లు తయారుచేసి రిక్వెస్ట్‌లు పంపిస్తున్నారు. పెళ్లి ప్రస్తావన తెస్తే.. అమెరికాలో ఉద్యోగమని కొన్ని నెలల్లోనే తిరిగొస్తామని చెబుతూ డబ్బు కొట్టేస్తున్నారు.

**ఒక్కడే 24 మందికి టోకరా**

జూబ్లీహిల్స్‌కు చెందిన వైద్యురాలికి మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో ఓ వ్యక్తి పెళ్లి చేసుకుందామని ప్రతిపాదన తెచ్చాడు. ఆమె అంగీకరించింది. తన తల్లి అమెరికాలో వైద్యురాలని.. ఆమె భారత్‌కు రాగానే పెళ్లి చేసుకుందామని నమ్మించి.. రూ.10.94 లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. నిందితుడు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో 24 మంది మహిళల్ని మోసగించినట్లు దర్యాప్తులో తేలింది.

భర్తను కోల్పోయిన ఐటీ ఉద్యోగి రెండో పెళ్లికి సిద్ధమైంది. మ్యాట్రిమోనిలో అమెరికాలోని వైద్యుడి నుంచి ప్రతిపాదన వచ్చింది. 3 నెలల్లో భారత్‌కు వచ్చి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆమె వద్ద రూ.7 లక్షలు వసూలు చేశాడు. తర్వాత స్పందన లేకపోవడంతో మోసపోయనని తెలుసుకుంది.

**ఇవీ జాగ్రత్తలు**

మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో సంబంధాలను కచ్చితంగా నిర్ధారించుకున్నాకే ముందుకెళ్లాలి

కేవలం ఫోన్ ద్వారా కాకుండా కాబోయే భాగస్వామి ఇంటికెళ్లి మాట్లాడుకోవాలి

ఆన్‌లైన్ పరిచయంతో డబ్బు పంపకూడదు.

విదేశాల్లో ఉన్నట్లు చెబితే ఇక్కడ ఉండే వారి తల్లిదండ్రుల్ని కలిసి వివరాలు తెలుసుకోవాలి.

# ఆక్రమణలపై ఉక్కుపాదం.. ఆహ్లాదానికి అభయం



శేరిలింగంపల్లి : హైటెక్‌సిటీ ప్రాంతంలోని రెండు ప్రధాన చెరువులు తమ్మిడికుంట, సున్నంచెరువులను హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకప్పుడు సాగునీరు, తాగునీరు అందించిన ఈ చెరువులకు పూర్వవైభవం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. మోటార్లతో మురుగునీటిని మొత్తం ఖాళీ చేయించి పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. చెరువు కట్టను బలోపేతం చేస్తూ చుట్టూ బండ్ నిర్మిస్తున్నారు. మొత్తం రూ.18 కోట్ల అంచనా వ్యయంతో రెండు చెరువులు అభివృద్ధి చేస్తున్నారు. పూడికతీత, చెరువు చుట్టూ బండ్, కంచె నిర్మాణం, వాకింగ్, సైకిల్ ట్రాక్, పూలమొక్కల పెంపకంతోపాటు ముఖద్వారం నిర్మాణంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

**కబ్జాల నుంచి విముక్తి..**

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల సరిహద్దులో సున్నంచెరువు విస్తరించి ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సున్నంచెరువును స్వయంగా పరిశీలించి ఆక్రమణల తొలగింపునకు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

శిల్పారామం ఎదురుగా దాదాపు 30 ఎకరాల్లో తమ్మిడిచెరువు విస్తరించి ఉంది. చెరువులో కొంతభాగం శిల్పారామం పార్కింగ్ కోసం గతంలో పూడ్చివేశారు. మరోవైపు ఓ సినీనటుడు కన్వెన్షన్ సెంటర్ నిర్మించగా, కొందరు ఎఫ్‌టీఎల్‌లో షెడ్లు నిర్మించారు. గతేడాది రంగంలోకి దిగిన హైడ్రా ఎన్ కన్వెన్షన్‌తోపాటు ఎఫ్‌టీఎల్‌లో షెడ్లను నేలమట్టం చేసింది. ఇప్పుడు చెరువు అభివృద్ధి చేసే క్రమంలో పూడికతీత పనులు సాగుతున్నాయి. మరోవైపు చెరువు బండ్‌ను బలోపేతం చేస్తున్నారు.

ఆరు నెలల్లో పూర్తి: నాగరాజు ఏఈఈ, ఇరిగేషన్ విభాగం, జీహెచ్ఎంసీ ఈ రెండు చెరువుల్లో పూడిక పనులు సాగుతున్నాయి. రోజు 600 ట్రిప్పుల పూడిక బయటకు తరలిస్తున్నారు. మరో పక్షం రోజుల్లో పూడిక పనులు పూర్తి చేసి తర్వాత బండ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ముందు చెరువు పునరుద్ధరణ పూర్తి చేసి తర్వాత సుందరీకరణ పనులు చేపడతాం. మొత్తం ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

# పగలు మర్కటాలు.. రాత్రి అడవి పందులు



వీర్నపల్లి: పంటల సాగులో ఆది నుంచీ అన్నదాతలకు ఇబ్బందులు పరిపాటిగా మారాయి. నీటి ఎద్దడితో పంటను కాపాడుకున్న కర్షకుల శ్రమకు చివరిలో కోత పడుతోంది. అకాల వర్షాలకు ధాన్యం మొలకెత్తుతోంది. మరోవైపు అటవీప్రాంతంలో ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలపై వన్యప్రాణులు నిత్యం దాడులు చేస్తూ అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పగలు కోతులు, రాత్రి అడవిపందుల దాడులతో దిక్కుతోచని దుస్థితి ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో యాసంగిలో 1.74 లక్షల ఎకరాల్లో అన్నదాతలు వరిసాగు చేశారు. 242 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదట్లో రైస్ మిల్లుల కేటాయింపులో ఆలస్యం కారణంగా ప్రక్రియ నెమ్మదిగా సాగింది. సాంకేతిక సమస్యలు పరిష్కరించినప్పటికీ ప్రస్తుతం లారీల రాకలో జాప్యం, హమాలీల కొరతతో కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోంది.

**రక్షణ చర్యలు చేపడుతున్నా..**

గతంలో ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్లను పంపిణీ చేసింది. భారీ పరిమాణం ఉన్న ఈ ప్లాస్టిక్ పరదాలను వర్షాలు కురిసినప్పుడు అన్నదాతలు వినియోగించేవారు. ప్రస్తుతం టార్పాలిన్ల పంపిణీ లేకపోవడంతో చీరలతో కుట్టిన పరదాల్లో ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వానలకు కుప్పల చుట్టూ వరద నీరు నిలుస్తోంది. నేల తడితో కిందిభాగంలో ఉన్న గింజలు పూర్తిగా మొలకెత్తుతున్నాయి. రక్షణ చర్యలు చేపడుతున్నప్పటికీ కోతులు, అడవి పందుల దాడులు ఆగడం లేదని అన్నదాతలు చెబుతున్నారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, గంభీరావుపేట మండలాల్లోని అటవీ సరిహద్దు గ్రామాల్లో అడవి జంతువుల బెడద ఎక్కువైంది. మొలకల వాసనకు రాత్రి సమయంలో అడవి పందులు కుప్పల వద్దకు చేరుతున్నాయి. అడుగున ఉన్న మొలకలను తినేందుకు ధాన్యం కుప్పను చిందరవందర చేస్తున్నాయి.

**వేకువజామున కాపలా కాస్తున్నా**

నెల రోజుల క్రితమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించా. సుమారు 200 బస్తాలు తూకం వేసి పెట్టారు. తరలింపులో ఆలస్యం జరుగుతోంది. వారం రోజులుగా అడవి పందులు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలపై దాడులు చేస్తున్నాయి. వర్షం కురుస్తున్నా వేకువజామున వచ్చి కాపలాగా ఉంటున్నా.హుస్సేన్, వన్‌పల్లి

**కంటిమీద కునుకు లేదు** ధాన్యం తరలింపులో ప్రభుత్వ యంత్రాంగం చాలా జాప్యం చేస్తుంది. వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదు. యాభై రోజుల క్రితం ధాన్యం కోతచేపట్టి కేంద్రానికి తరలించా. దొడ్డు రకం వడ్లు కొనుగోలు చేశారు. సుమారు 50 క్వింటాళ్ల వరకు సన్నధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయింది. వర్షాలకు ధాన్యం మొలకెత్తుతోంది. వేకువజామున పందులు దాడిలో రెండు క్వింటాళ్ల వరకు నష్టం జరిగింది. గునుగుల దేవేందర్‌రెడ్డి, రైతు, వన్‌పల్లి

# అతివల హితం.. నగదు రహితం

పెద్దపల్లి : పెద్దపల్లి మండలం కాపులపల్లిలోని స్వశక్తి సంఘాల మహిళలు ప్రతి నెలా చెల్లించాల్సిన పొదుపు, రుణ వాయిదాల డబ్బును వినియోగదారుల సేవా కేంద్రం (సీఎస్‌సీ) నిర్వాహకురాలికి అప్పగించారు. ఆమె సంఘాల ఖాతాల్లో జమ చేయలేదు. తర్వాత గుర్తించిన సభ్యురాళ్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

చిగురుమామిడి మండలం లంబాడిపల్లిలో స్వశక్తి మహిళలు నెలవారీ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించారు. అయితే నేరుగా బ్యాంకుకు వెళ్లకుండా వీవోఏ (గ్రామైక్య సంఘం) ప్రతినిధులకు ఇచ్చారు. వారు ఖాతాల్లో జమ చేయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు చిరు వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమలతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు అందుబాటులో లేకపోవడంతో పొదుపు సొమ్ము, రుణ కిస్తీల చెల్లింపులో ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని బ్యాంకులో



జమ చేయకుండా డబ్బు కాజేస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సెర్ప్ కార్యాచరణ చేపట్టింది. జిల్లాకు ఒక మండలంలో ప్రయోగాత్మకంగా నగదు రహిత లావాదేవీలపై అతివలకు అవగాహన కల్పించేందుకు సన్నద్ధమవుతోంది.

**పక్కదారి పడుతున్న పొదుపు సొమ్ము**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 42,504 సంఘాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. ఈ ఏడాది రూ.2,555.15 కోట్ల రుణ లక్ష్యం విధించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు లేకపోవడంతో మహిళలు స్థానిక సీఎస్‌సీ కేంద్రాలు, వీవోఏలు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు ఇచ్చిన రుణ కిస్తీ డబ్బులు పక్కదారి పడుతున్నాయి. ఖాతాలో జమ కాలేదని గుర్తించిన తర్వాత బాధితులు ప్రశ్నించినా బాధ్యులు చేతులెత్తేస్తుండటంతో రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

**ఇదీ ప్రణాళిక..**

ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని నగదు రహిత లావాదేవీల అమలుకు ప్రయోగాత్మకంగా ఎంపిక చేస్తారు.

రుణ కిస్తీ, పొదుపు డబ్బులను బ్యాంకులో జమ చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తారు.

ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలపై సభ్యుల సందేహాలు నివృత్తి చేస్తారు.సభ్యులు ఇంటి వద్దనే ఉంటూ బ్యాంకు ఖాతాకు నగదు చెల్లించేలా సన్నద్ధం చేస్తారు.

ప్రతి లావాదేవీకి రశీదు

స్వశక్తి మహిళలు ఇప్పటి వరకు బ్యాంకు లావాదేవీల సమయంలో రశీదులు తీసుకోవడం లేదు. నమ్మకంతో పొదుపు రుణ కిస్తులు చెల్లిస్తున్నా ఏదో ఒక చోట మోసాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితికి తావు లేకుండా డిజిటల్ బ్యాంకింగ్ విధానం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సభ్యురాలూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించేలా అవగాహన కల్పిస్తాం. రవికుమార్, అదనపు ప్రాజెక్టు అధికారి, సెర్ప్

# మరోసారీ ముంపు ముప్పు!

ఖమ్మం: వర్షాకాలం సమీపిస్తుండటంతో ఖమ్మం జిల్లాలోని నగరపాలిక, పురపాలికల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏటా వానాకాలంలో భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమయ్యే లోతట్టు ప్రాంతాలకు ఈసారీ ముంపు ముప్పు తప్పేలా లేదు. ముందస్తు సన్నద్ధత చర్యల్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు 100 రోజుల ప్రణాళిక రూపొందించామని అధికారులు చెబుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులకు పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఖమ్మంలో కన్నీరు'మున్నేరు'..**

ఖమ్మం నగరంలో మున్నేరు పరీవాహక కాలనీలు సారథినగర్, మంచికంటినగర్, వెంకటేశ్వరకాలనీ, పద్మావతినగర్, కాలొద్దు, బొక్కలగడ్డ, మోతీనగర్ గతేడాది జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. రామన్నపేట, దానవాయిగూడెం కాలనీలకు ఏటా వరద ముప్పు తప్పటం లేదు. వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు మున్నేరుకు రెండువైపులా చేపట్టిన కరకట్టల నిర్మాణ పనులు కొనసా..గుతున్నాయి. నిజాంపేట, చెరువుబజార్, వరదయ్యనగర్‌తోపాటు నగరంలోని ప్రధాన రహదారుల వెంట మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేదు. కాల్వలు పొంగి వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. మురుగుకాల్వల ఆక్రమణలతో పరిస్థితి మరింత దిగజారింది. ఈసారి వరద తీవ్రతను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని కమిషనర్ అభిషేక్ అగస్త్య చెబుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేకాధికారులను నియమించి.. స్థానికంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేస్తామని తెలిపారు. వర్షాకాలం సన్నద్ధత, సహాయక చర్యలపై 100 రోజుల ప్రణాళికను జూన్ 2 నుంచి అమలుచేస్తామన్నారు.

**మధిరలో మారని తీరు**

మధిర అంబారిపేట పెద్దచెరువుకు రాతి కరకట్ట లేకపోవటం వల్ల ఏటా వానాకాలంలో వరదరాఘవాపురం, హనుమాన్‌కాలనీ, ముస్లింకాలనీకి వరదనీరు పోటెత్తుతుంది. మట్టి కట్ట స్థానంలో కిలోమీటరు మేర రాతికట్ట నిర్మిస్తేనే ముంపు సమస్యకు కొంత అడ్డుకట్ట వేయొచ్చు. బంజారాకాలనీ, లడక్‌బజార్‌లో వరద కాల్వ ఆక్రమణకు గురవటం వల్ల చిన్నపాటి వర్షానికే ఇళ్లల్లోకి, రహదారులపైకి భారీగా వరద నీరు చేరుతుంది.

కరకట్ట నిర్మాణం కలేనా? వైరా

నల్లచెరువు వాగు నిండి ఏటా ఇందిరమ్మ కాలనీ ముంపునకు గురవుతోంది. సుమారు 200 ఇళ్లల్లోకి వరద చేరుతోంది. ఇక్కడ ముంపు నివారణకు కరకట్ట నిర్మించాలనే డిమాండ్ 15ఏళ్లుగా అమలుకు నోచుకోవటం లేదు. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే సమీపంలోని రాజీవ్‌కాలనీకి వరద పోటెత్తుతుంది. ఏటా తూతూమంత్రంగా రక్షణ చర్యలు చేపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సత్రంబజార్, శాంతినగర్, సంతబజార్‌లు ఏటా వరద గుప్పిట్లో చిక్కుకుంటాయి. మురుగునీటి వ్యవస్థను పటిష్ఠపరిస్తేనే ముంపు ముప్పు తొలగుతుందని స్థానికులు చెబుతున్నారు.

మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం

సత్తుపల్లిరాజీవ్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్‌ను ఏటా వరదనీరు ముంచెత్తుతుంది. శివారు ప్రాంతాలను ఆనుకుని ఉన్న మురుగుకాల్వలు పొంగి ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుంది. మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిస్తేనే ముంపు ముప్పును తప్పించవచ్చు.

# పరిధి మార్పు.. సేవలు సులభం

గోదావరిఖని: ప్రజలకు పోలీసుల సేవలు అందుబాటులో ఉండేలా ఆ శాఖ చర్యలు తీసుకుంటోంది. పరిపాలన సౌలభ్యం కోసం పోలీసు శాఖ ఠాణాల పరిధి మార్పుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించింది. కొన్ని ప్రాంతాలు సమీప ఠాణాలకు దగ్గర ఉన్నా వాటి పరిధి మాత్రం దూరంలోని పోలీసుస్టేషన్‌లో ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక ఠాణా నియోజకవర్గం పరిధిలో ఉండగా సర్కిల్ మరో నియోజకవర్గం పరిధిలో ఉండటంతో పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో కొన్ని ఠాణాలకు అందుబాటులోని ప్రాంతాలను కలుపుతూ వాటి పరిధిలో కొన్ని మార్పులు చేస్తూ ప్రతిపాదనలు పంపారు. దీంతో అందుబాటులో ఉన్న ఠాణాల పరిధిలోకి ఆయా ప్రాంతాలను చేర్చడం ద్వారా సేవలు వేగంగా అందించే అవకాశం ఉంది. దానికి అనుగుణంగా ప్రతిపాదనలు తయారు చేసినట్లు సమాచారం.

**గోదావరితీరం ఒకటో ఠాణాకు..**

ప్రస్తుతం గోదావరిఖని రెండో ఠాణా పరిధిలోని గోదావరి తీరం, కోల్‌బెల్ట్ వంతెన, జనగామ, సమ్మక్క సారలమ్మ జాతర, గంగానగర్ శివారు ప్రాంతాలను ఒకటో ఠాణా పరిధిలోకి మార్చేందుకు ప్రతిపాదనలు చేశారు. రెండో ఠాణా యైటింక్లైన్‌కాలనీలో ఉండటంతో ఆయా



ప్రాంతాల్లో ఏదైనా సంఘటన చోటుచేసుకుంటే రావడానికి సమయం పడుతుంది. ఆ ప్రాంతాలను పక్కనే ఉన్న ఒకటో ఠాణాలో విలీనం చేయడం ద్వారా సకాలంలో అధికారులు చేరుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతర్గాం ఠాణా పరిధిలో ఉన్న కుందనపల్లి, లింగాపూర్, మల్యాలపల్లి, బసంత్‌నగర్ రైల్వేపై వంతెన రాజీవ్‌రహదారిని రామగుండం ఠాణా పరిధిలోకి తీసుకురావడానికి అధికారులు ప్రతిపాదనలు చేసినట్లు తెలిసింది. రామగుండం ఠాణాకు పక్కనే ఉండే ఈ గ్రామాలు ఇందులో కల్పడం ద్వారా సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నారు.

**ఒకే సబ్ డివిజన్ కిందికి..**

పెద్దపల్లి, గోదావరిఖని సబ్ డివిజన్‌ల పరిధిలో ఆయా నియోజకవర్గాల ప్రాంతాలు ఉండే విధంగా అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలుస్తోంది. రామగుండం నియోజకవర్గం పరిధిలో ఉన్న బసంత్‌నగర్ ఠాణా పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఉంది. ఠాణా పరిధిలోని గ్రామాలు మాత్రం రామగుండం నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. దీంతో బసంత్‌నగర్ పరిధి రామగుండం నియోజకవర్గంలోని గ్రామాలను గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఠాణా పరిధిలో మంథని, పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాలకు చెందిన గ్రామాలున్నాయి. బసంత్‌నగర్ పోలీసుస్టేషన్ పెద్దపల్లి సర్కిల్‌తో పాటు అదే సబ్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. దీన్ని రామగుండం సర్కిల్‌తో పాటు గోదావరిఖని సబ్ డివిజన్‌లో కలిపేందుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలిసింది. బసంత్‌నగర్ ఠాణా పరిధిలో ప్రస్తుతం పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన రాఘవాపూర్, సబ్బితం, రంగాపూర్, అందుగులపల్లి, అప్పన్నపేట, బొంపల్లి గ్రామాలున్నాయి. ధర్మపురి నియోజకవర్గం పరిధిలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండేడ, మంథని పరిధిలోని కన్నాల, రాణాపూర్ గ్రామాలున్నాయి.

# చిన్నబోయిన చిరు వ్యాపారి

కరీంనగర్ : చిరు, వీధి వ్యాపారులకు అందించే ప్రధానమంత్రి స్వనిధి రుణాల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. జిల్లాలోని నగర, మున్సిపాలిటీల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించే వీధి వ్యాపారులను ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వల్పకాలిక రుణాలను మంజూరు చేస్తోంది. కరోనా లాక్‌డౌన్ నుంచి దీన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద గుర్తించిన వీధి వ్యాపారులకు మొదటి విడతలో లబ్ధిదారుడికి రూ.10 వేల రుణం అందజేస్తారు. ఈ మొత్తాన్ని బ్యాంకుల ద్వారా నేరుగా ఖాతాలో జమ చేస్తారు. చిన్న వ్యాపారులకు ఈ మొత్తం ఎంతగానో ఉపయోగపడేది.

**మూడో విడతకు ఎదురుచూపులు**

ఐదేళ్ల కిందట ప్రతి వీధి వ్యాపారికి రూ.10 వేలు ఖాతాలో జమ చేయగా.. ఈ మొత్తాన్ని ఏడాదిలోపు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించిన వారికి మళ్లీ రుణం తీసుకోవడానికి వీలు కలిగేది. రెండో విడతలో



రూ.20 వేలు అందించగా.. మూడో విడతలో రూ.50 వేలకు పెంచారు. రుణ మొత్తం పెరుగుతుండటం, వ్యాపారాభివృద్ధికి తోడుగా ఉండటంతో రుణం తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకర్లు సైతం ఈ రుణాలు సక్రమంగా చెల్లించినవారికి అందించేందుకు ముందుకొచ్చారు. మూడు నెలలుగా రుణాలు అందించడంలేదు.

**కొత్త పథకం కోసమేనా?**

ఆత్మనిర్భర్ కింద రుణాలు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధించి మరీ రుణాలు అందిస్తుండగా.. ఇటీవల కొత్త పథకం అమలు చేసేందుకు వీలుగా సాంకేతికపరంగా ఐచ్ఛికం ఇవ్వకపోవడంతో పాతవారికి కూడా రుణాలు అందించేందుకు బ్రేక్ పడింది. కొత్త పథకం అమలు చేసేంత వరకు పీఎం స్వనిధి పథకం నిలిచిపోయినట్లుగానే చెబుతున్నారు. అయితే వీధి వ్యాపారులకు రూ.50 వేల వరకు ఇస్తున్న రుణాన్ని రూ.లక్షకు పెంచితే ఆర్థిక అవసరాలు తీరడంతోపాటు ఉపాధి పెరిగి జీవన ప్రమాణాలు పెరగనున్నాయి.

# పర్యాటక సిరి.. ఆదాయంపై గురి



హైదరాబాద్: నగరంలోని హుస్సేన్‌సాగర్ పరిసరాలైన ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్డు, లుంబిని పార్కు, ఐమాక్స్ థియేటర్ల వద్ద నిత్యం సందడి కనిపిస్తుంటుంది. శని, ఆదివారాల్లో పర్యాటకుల సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంటోంది. పర్యాటకాన్ని ఆదాయ వనరులుగా మార్చుకునేందుకు ట్యాంక్‌బండ్ చుట్టూ హెచ్‌ఎండీఏ పలు వాణిజ్య కూడళ్లను నిర్వహిస్తోంది. చాలా ఏళ్లుగా వాటిని లీజు, అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని పొందుతోంది. పలువురు లీజుకు, అద్దెకు తీసుకొని తర్వాత చెల్లింపులు చేయక ఎగవేస్తున్నారు. ఇప్పటికే అధికారులు కొన్ని లీజులను రద్దు చేశారు. తాజాగా హుస్సేన్‌సాగర్ చుట్టూ 20 వరకు వాణిజ్య కూడళ్లను గుర్తించి వాటిని తిరిగి అద్దెకు ఇచ్చేందుకు హెచ్‌ఎండీఏ కసరత్తు చేస్తోంది. త్వరలో వీటికి టెండర్లు పిలిచేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఐమాక్స్, ఎన్టీఆర్ మెమోరియల్ పార్కింగ్, లుంబిని పార్కు రెస్టారెంట్, క్లోక్‌రూంలు, సంజీవయ్య పార్కు వద్ద వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించి అద్దెలకు ఇచ్చేందుకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు.

**ఎగవేతదారులపై చర్యలేవీ?**

గతంలో పేరుకుపోయిన అద్దెల వసూళ్లపై హెచ్‌ఎండీఏ తగిన శ్రద్ధ చూపటం లేదు. గతంలో హెచ్‌ఎండీఏ నుంచి వాణిజ్య ప్రదేశాలను అద్దెలకు తీసుకొని అద్దెలు చెల్లించకుండా రూ.కోట్లు ఎగవేసిన వారిపై చట్టపరమైన చర్యలు లేకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగించినట్లు అధికారులు చెబుతున్నా.. పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రాలేదు. దీంతో తమకేం కాదనే ధీమాతో ఎగవేతదారులు తిరిగి మరో రూపంలో హెచ్‌ఎండీఏ టెండర్లను దక్కించుకోవడానికి సమయాత్తమవుతున్నట్లు తెలుస్తోంది. లుంబిని పార్కులో గతంలో రెస్టారెంట్ నిర్వహించి, రూ.1.5 కోట్లకు బకాయి పెట్టి బోర్డు తిప్పేశారు. ఐమాక్స్ వద్ద హెచ్‌ఎండీఏ పార్కింగ్ బకాయిలు కూడా రూ.45 లక్షలకు చేరడంతో నిర్వాహకులు తప్పుకొన్నారు. డిపాజిట్లకు మించి బకాయిలు పెరుగుతున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పేరుకున్న బకాయిలు ఇలా...(రూ.ల్లో)

ఐమాక్స్ వద్ద పార్కింగ్– 45 లక్షలు
లుంబిని పార్కు రెస్టారెంట్– 1.5 కోట్లు
ఎన్టీఆర్ మార్గ్ క్లోక్‌రూం– 16 లక్షలు
ఎన్టీఆర్ మెమోరియల్ పార్కింగ్– 21 లక్షలు
లుంబిని పార్కు క్లోక్‌రూం– 11 లక్షలు

# పారిశ్రామిక వాడ.. ప్రగతి జాడ



తాండూరు : తాండూరు పరిధి జిన్‌గుర్తి పారిశ్రామికవాడలో పనులు వడివడిగా సాగుతున్నాయి. వేలాది పరిశ్రమలు ఒక్కచోటుకి చేరనున్నాయి. అందుకు అనుగుణంగా ఒక్కొక్కటిగా సదుపాయాలు సమకూరుతున్నాయి. తొలుత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా పనులు మేలో పూర్తి కానున్నాయి. నెలరోజుల్లో తారు రహదారులు అందుబాటులోకి రానున్నాయి.

**వాణిజ్య కేంద్రంలో తొలిసారిగా ఏర్పాటు**

జిల్లాలో వాణిజ్య కేంద్రమైన తాండూరు మండలంలో తొలిసారిగా పారిశ్రామికవాడ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. దీంతో దశాబ్దాలుగా ఉన్న డిమాండ్ కార్యరూపం దాల్చబోతోంది. జిన్‌గుర్తి పరిధిలోని 216 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి పారిశ్రామిక వాడకు కేటాయించారు. దీంతో టీఎస్‌ఐఐసీ మౌలిక సదుపాయాల కల్పనకు నడుం బిగించింది. తొలుత పారిశ్రామికవాడ ప్రాంతంలో రహదారులు నిర్మించేందుకు ఖరారు చేసింది. గతేడాది పనులు చేపట్టగా ఎర్రమట్టి మొరం పనులు పూర్తయ్యాయి. తాజాగా కంకర పరిచే పనులు నిర్వహిస్తున్నారు.

**సదుపాయాలుంటే తరలనున్న పరిశ్రమలు**

మౌలిక సదుపాయాల కల్పన పూర్తయితే నియోజకవర్గంలోని వేయికిపైగా ఉన్నా నాపరాయి పరిశ్రమలన్నింటినీ పారిశ్రామిక వాడలోకి తరలించనున్నారు. నాపరాయి కొనుగోలుదారులు నాణ్యత, ధరలను పరిశీలించి కొనేందుకు సౌకర్యంగా మారుతుంది. చెంతనే జాతీయ రహదారి ఉండటంతో ఎగుమతులకు, దిగుమతులకు సౌలభ్యంగా మారుతుంది. దీంతో రవాణా ఇబ్బందులు తొలగుతాయి. ఇంజనీరింగ్, వెల్డింగ్ వర్క్స్, గిట్టీల తయారీ వంటి పరిశ్రమలను సైతం పారిశ్రామికవాడకు తరలించనున్నారు.

**త్వరలో విద్యుదీకరణ పనులు**

రహదారుల నిర్మాణం పూర్తవగానే విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు టీఎస్‌ఐఐసీ అధికారులు ఖరారు చేశారు. పారిశ్రామిక వాడలోనే విద్యుత్తు ఉపకేంద్రాన్ని నిర్మించగా గతేడాది రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఇక్కడి ఉపకేంద్రం ద్వారా పారిశ్రామికవాడలో కొత్తగా వందల సంఖ్య విద్యుత్తు స్తంభాలు అమర్చి, తీగలు వేసి నియంత్రికలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రదేశం: జిన్‌గుర్తి
విస్తీర్ణం: 261 ఎకరాలు
మంజూరైన నిధులు: రూ.30కోట్లు
పెట్టిన ఖర్చు: రూ.10కోట్లు
రహదారులు: 13 కి.మీ.
సమకూరేది: మే నెలాఖరు

# అడుగంటుతున్న జలం..అల్లాడుతున్న జనం

ఎల్లారెడ్డిపేట : నడి వేసవికి ముందే పల్లెల్లో తాగునీటి కటకట నెలకొంది. భూగర్భజలాలు అడుగంటి పోతుండటంతో గుక్కెడు నీటి కోసం జనం అల్లాడుతున్నారు. గొంతు తడుపుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. పొద్దంతా పనులు వదిలిపెట్టుకుని బిందెడు నీటి కోసం వ్యవసాయ క్షేత్రాల వెంట పరుగులు పెడుతున్నారు. సహనం కోల్పోయి నిరసనకు దిగుతున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి ఎద్దడి గ్రామాల్లో తీవ్రమవుతోంది.

**నిర్వహణ అధ్వానం**

ఎల్లారెడ్డిపేట మండలంలోని 26 గ్రామాల్లో 46270 జనాభా ఉంది. సుమారు 39 ఓహెచ్‌ఎస్‌ఆర్, మూడు జీఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకులు ప్రజల దాహార్తిని తీర్చుతున్నాయి. భూగర్భజల మట్టాలు పాతాళానికి చేరుతుండటంతో బావులు, గొట్టపు బావుల్లో నీరు తగ్గి ట్యాంకులకు నీరందడం లేదు. కొన్ని గ్రామాల్లో మూడునాలుగు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు 500 నుంచి నాలుగు లీటర్ల శుద్ధజలాన్ని అందించే కేంద్రాలు గ్రామాల్లో ఉన్నా వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని మారుమూల గిరిజన తండాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గుండారం, తిమ్మాపూర్, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా తదితర గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఏ మూలకూ సరిపోవడం లేదని గిరిజన తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు రోజులకోసారి అరకొరగా నీటిని వదులుతున్నారని వాపోతున్నారు. గొంతు తడుపుకోవడంతోపాటు ఇతరత్రా అవసరాలకు నీరు లేక అల్లాడుతున్నామని చెబుతున్నారు.

**అలంకార ప్రాయంగా ట్యాంకులు**

ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో గతంలో ఓహెచ్‌ఎస్‌ఆర్, సిస్టర్న్‌లను విరివిగా నిర్మించారు. ఇళ్లకు నేరుగా అందాల్సిన మిషన్ భగీరథ నీటితోపాటు గ్రామాల్లోని బోరుబావుల నుంచి వచ్చే నీటిని ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల్లోకి చేర్చుతున్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులకు నీరందించే మంచినీటి బావులు, బోర్లు సైతం వట్టిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో అలంకారప్రాయంగా మారుతున్నాయి. జనాభా ప్రాతిపదికన ఒక్కో వ్యక్తికి రోజుకు 25 లీటర్ల చొప్పున సరఫరా చేయాల్సి ఉంటుంది. గతంలో అమర్చిన చేతిపంపులు ఎక్కడా కనిపించడం లేదు. తాత్కాలికంగా అమర్చిన సింగిల్‌ఫేజ్ మోటార్లు నీరు లేక మొండికేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అవి పనిచేయక పోవడంతో మరమ్మతుల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తాగునీటి ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య తలెత్తకుండా ప్రణాళిక

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుగానే ప్రణాళిక రూపొందించాం. బండలింగంపల్లి, దుమాల, రాచర్ల గొల్లపల్లి, గుండారం, కిష్టునాయక్‌తండాల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఓపెన్‌వెల్ మోటార్లు, బోరుబావుల తవ్వకం, పైపులైన్ ఏర్పాటు, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవడం వంటి చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించి, చర్యలు తీసుకుంటాం. జోగం రాజు, ఎంపీవో, ఎల్లారెడ్డిపేట

# అందని ద్రాక్షగా ఆయుష్ సేవలు

ధర్మపురి: ప్రాచీన వైద్యాన్ని కాపాడుతూ.. రోగులకు సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయుష్ ఆస్పత్రులను ఏర్పాటు చేసింది. ఆయుర్వేదం, యోగా, యునానీ, ఆయుష్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి వీటి ద్వారా సేవలు అందిస్తున్నారు. జిల్లాలోని ఆయుష్ దవాఖానాలు సుప్త చేతనావస్థలో కొట్టుమిట్టాడుతున్నాయి. వైద్యులు, సిబ్బంది నియామకాలు, అభివృద్ధి చర్యలపై పట్టించుకోకపోవడంతో రోగులకు సేవలు అందటం లేదు. దీంతో ఆయా ఆసుపత్రులు అలంకారప్రాయంగానే మారాయి.

ఆయుష్ ఆస్పత్రులు జాతీయ ఆరోగ్య మిషన్ కింద మంజూరయ్యాయి. ఒక్కొక్క కేంద్రంలో ఒక వైద్యుడు, ఫార్మాసిస్టు, వాచ్‌మెన్‌లు ఉండాలి. కానీ జిల్లా అధికారులు ఒక్కరినే నాలుగైదు కేంద్రాలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌ఛార్జిలు ఆయా కేంద్రాలకు వెళ్లకుండానే కాలం వెళ్లదీస్తున్నారు. ఖాళీగా ఉన్న కేంద్రాల్లో ఫార్మాసిస్టు, వాచ్‌మెన్లతోనే నడిపిస్తున్నారు.

**మొక్కుబడిగానే నిర్వహణ**

యునానీ, ఆయుర్వేద వైద్య ఆసుపత్రులను యోగా అధ్యయన కేంద్రాలుగా మార్చారు. 2022 ఆగస్టులో రూ.5 లక్షల నిధులు కేటాయించి నూతన భవనాలు నిర్మించారు. ధ్యాన కేంద్రాలకు



పంచకర్మ పరికరాలను కేటాయించారు. వ్యాయామం చేయటానికి రెండు పరికరాలు సమకూర్చారు.

ఆయుర్వేద వైద్యశాలలు(రెగ్యులర్)అల్లీపూర్, బండలింగాపూర్, చిల్వాకోడూర్, లక్ష్మీపురం మేడిపల్లి, వీవీరావుపేట, వెల్లులలో వైద్యురాలు లేక ఫార్మాసిస్టులు సేవలందిస్తున్నారు.

ఆయుర్వేద(ఎన్ఆర్‌హెచ్‌ఎం)

అంబారీపేట, జగ్గాసాగర్, కల్లెడ, కథలాపూర్, మెట్‌పల్లిలలో రెండేసి వైద్య సిబ్బంది పోస్టులు ఉండాల్సిన.. ఒకొక్కరు పని చేస్తున్నారు.

యునానీ కేంద్రాలు(రెగ్యులర్)

మల్యాల, కోరుట్ల, ధర్మపురి, ఎండపల్లిలలోని యునానీ ఆసుపత్రుల్లో ఒక్క వైద్యుడు లేరు. ఎండపల్లి పూర్తిగా మూతపడింది. మిగతా చోట్ల మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు.

**మందుల కొరత లేదు** – డా.శివకుమార్, జిల్లా ఆయుష్ వైద్య ప్రోగ్రాం అధికారి జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇన్‌ఛార్జులతోనే సేవలందిస్తున్నాం. ధర్మపురి లాంటి ఆసుపత్రులకు పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రస్తుతం అన్ని ఆసుపత్రులు నడిచేలా చర్యలు తీసుకుంటున్నాం. మందుల కొరత లేదు.

# భారం కాదు.. సారమే

ధర్మారం: యాసంగి వరి కోతలు జోరందుకోగా వానాకాలం సాగు సన్నద్ధతలో భాగంగా పొలాల్లోని గడ్డికి, వ్యర్థాలకు నిప్పంటిస్తుండటం ప్రమాదాలకు దారి తీస్తోంది. భగభగమంటున్న ఎండలతో మంటలు వేగంగా విస్తరిస్తున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు లేస్తున్నాయి. నిప్పు ఎలా రాజుకున్నా రైతులకు ఆర్థికంగా నష్టంతో పాటు భూసారం దెబ్బతింటోంది.

అదుపులోకి తేవడం కష్టమే

ఈ నెల 23న ధర్మపురి శివారులో ఓ రైతు పంట వ్యర్థాలను కాల్చివేసేందుకు నిప్పు పెట్టగా సమీపంలోని కోతకు వచ్చిన మొక్కజొన్న చేనుకు నష్టం జరిగింది.

ఈ నెల 24న రామగిరి మండలం కల్వచర్లలోని పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడంతో పశుగ్రాసం కట్టలు కాలిపోయాయి.

అదే రోజు ముత్తారం మండలం ఓడేడ్‌లోని పొలాల్లో ప్రమాదవశాత్తు మంటలు లేచి పశుగ్రాసం దగ్ధమైంది.

2019 మే నెలలో రామగిరి మండలం లొంకకేసారంలో జరిగిన ప్రమాదంలో చంద్రయ్య, శ్రీనివాస్ తదితర రైతులకు చెందిన ఆరు ఎకరాల కోతకు వచ్చిన వరి పొలం, 150 ఎకరాల్లో పశుగ్రాసం కాలిపోయాయి. పదుల సంఖ్యలో పంపుసెట్లు, విద్యుత్తు తీగలు, పైపులైన్లు దగ్ధమయ్యాయి.

అయిదేళ్ల కిందట ధర్మారం మండలం కొత్తపల్లిలో రాత్రి సమయంలో పొలాల్లో మంటలు వ్యాపించాయి. పొలాల్లో తాత్కాలిక పాకలు వేసి కట్టేసిన అజ్మీరా రాజేశం, శంకర్, వాలునాయక్‌లకు చెందిన ఎనిమిది ఆవులు గాయపడ్డాయి.

అదే ఏడాది ధర్మారం మండలం దొంగతుర్తిలో మెరుగు శంకరయ్య, కొమురయ్యలకు చెందిన వరి కుప్పలు కాలిపోయి, రూ.1.20 లక్షల నష్టం జరిగింది.

అవగాహనతోనే ప్రయోజనం

పొలాల్లో గడ్డికి నిప్పంటించడం వల్ల భూమి భౌతిక స్థితి దెబ్బతింటుంది.

పంట ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడే సేంద్రియ కర్బనం, నత్రజని, సూక్ష్మ పోషకాలు పూర్తిగా నశిస్తాయి.

గడ్డిని కాల్చివేయడం వల్ల పంటలో కలుపు తగ్గుతుందని భావిస్తున్నారు. అయితే కలుపు మొక్కలే కాదు. పంట కూడా సరిగ్గా ఎదగదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

నేలకు మేలు చేసే వానపాములు, మైత్రి పురుగులు నశించి పంట ఎదగక దిగుబడి తగ్గుతుంది.

వరి గడ్డి, ఇతర పంట వ్యర్థాలను కాలుస్తుండటంతో కార్బన్ మోనాక్సైడ్ విడుదలై వాయు కాలుష్యానికి కారణమవుతోంది.

ఎండకు మంటలు వేగంగా విస్తరించి పక్కనున్న పొలాలకు వ్యాపిస్తాయి. ఆస్తి నష్టం కూడా కలుగుతుంది. వ్యవసాయ బావుల వద్ద పంపుసెట్లు, పైపులైన్లు కాలుతున్నాయి.

పొగతో శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుంది.

నేలలో కలిసిపోతే పంటకు ఎరువు

–డా.వై.వెంకన్న, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరి

వరి గడ్డిని, వ్యర్థాలను పొలంలో కలియ దున్నడంతో నేల సారవంతమై సూక్ష్మ పోషకాల స్థాయి పెరుగుతుంది. భూమి పైపొరలో కేవలం 10, 15 సెంటీమీటర్ల లోతులోనే పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులుంటాయి. మంటల ద్వారా అవి నశించి పంట ఎదగదు. పంట వ్యర్థాలు త్వరగా భూమిలో కలిసిపోయేందుకు ద్రావణాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పిచికారీ చేస్తే వారంలో కుళ్లిపోయి ఎరువుగా మారుతుంది. ఎకరాకు రూ.100 మాత్రమే ఖర్చవుతుంది.




కడప: దేవునికడపలో జరుగుతున్న ఈ మహానాడు చరిత్ర సృష్టించబోతోందని తెదేపా అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ మహానాడు దశ దిశ నిర్దేశిస్తుందని తెలిపారు. కడపలో మహానాడు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగించారు. "కడప గడ్డపై తొలిసారి మహానాడు ఏర్పాటు చేసుకుంటున్నాం. ఈ మహానాడు చరిత్ర సృష్టిస్తుంది. ఉమ్మడి కడప జిల్లాలో పదింటికి 7 స్థానాలు గెలిచాం. ఈసారి ఇంకొంచెం కష్టపడి పదికి పది గెలవాలి. 2024 ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయం అసామాన్యం. 93 శాతం స్ట్రైక్‌రేట్ సాధించి అద్భుత విజయం సాధించాం. పార్టీ ఇంతటి విజయాన్ని సాధించిందంటే పసుపు సైనికులే కారణం. జనసేన, భాజపాతో పొత్తు పెట్టుకున్నాం. ఏమీ ఆశించకుండా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే ఈ విజయం సాధ్యమైంది" అని చంద్రబాబు తెలిపారు.

**పీక కోస్తున్నా జై తెలుగుదేశం అన్నాడు..** "పార్టీ పని అయిపోయిందని మాట్లాడిన వాళ్లకు.. వాళ్ల పనే అయిపోయింది. 43 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలను ఎదుర్కొన్నాం. పాలనంటే హత్యా రాజకీయాలు, కక్షసాధింపులుగా గత ప్రభుత్వం మార్చేసింది. వైకాపా విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసింది. దీన్ని ప్రశ్నించిన తెదేపా కార్యకర్తలు, నాయకుల ప్రాణాలు తీశారు. వేటాడారు, వెంటాడారు.. అక్రమ కేసులు పెట్టారు. కానీ ఎత్తిన జెండా దించకుండా పోరాటం చేసిన మిమ్మల్ని అభినందిస్తున్నా. మన పసుపు సింహం, కార్యకర్త చంద్రయ్యను పీక కోస్తుంటే కూడా జై తెలుగుదేశం అని ప్రాణం వదిలాడు. ఆయనే మనకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తే పార్టీని నడిపిస్తుంది" అని చంద్రబాబు అన్నారు.

**రాజకీయాల్లో విలువలు తెచ్చిన ఏకైక పార్టీ..** "ప్రతిపక్షంలో ఉండగా అవినీతి వ్యతిరేక పోరాటం చేశాం. అధికారంలో ఉంటే అవినీతి రహిత పాలన అందించాం. ప్రజల ఆస్తులు, హక్కులకు రక్షణ కల్పించాం. పాజిటివ్ పాలిటిక్స్‌తో రాజకీయాల్లో విలువలు తెచ్చిన ఏకైక పార్టీ తెలుగు దేశం. తెలుగు రాష్ట్రాల్లో ఏ పార్టీలో చూసినా.. తెదేపా వర్సిటీలో చదివిన విద్యార్థులే. మన పార్టీ చరిత్ర చింపేస్తే చిరిగేది కాదు.. చెరిపేస్తే చెరిగేది కాదు. పార్టీ విధానాలు, ఆలోచనలు దేశంలోనే ప్రత్యేకంగా నిలిచాయి" అని చంద్రబాబు అన్నారు.




కడప: తెలుగుదేశం మహా పండగ మహానాడు సందర్భంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. "ఉత్తుంగ తరంగంలా ఎగసిపడే ఉత్సాహం తెదేపా కార్యకర్తల సొంతం. ఉరకలేసే యువత తెలుగుదేశం ఆస్తి. తరతరాల తెలుగు ఖ్యాతిని జగద్విదితం చేయడం తెలుగు దేశం పవిత్ర కర్తవ్యం. ప్రపంచ దేశాల్లో తెలుగు వారు ఎక్కడ ఉన్నా ఆ దేశానికే తలమానికంగా మారాలనేది మన సంకల్పం. అందుకే మనం నిరంతరం శ్రమిస్తున్నాం" "తెలుగుదేశం పరీక్షల్ని ఎదుర్కొన్న ప్రతిసారీ విజేతగానే నిలిచింది. గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విశ్వరూప సందర్శనం చరిత్రలో నిలిచిపోతుంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న తొలి మహానాడును కడపలో నిర్వహిస్తున్నాం. మహానాడు సందర్భంగా ప్రజా సేవకు పునరంకితమవుతూ 'యువగళం'కు ప్రాధాన్యతనివ్వాలని, 'అన్నదాతకు అండగా' నిలవాలని కోరుతున్నా. 'స్త్రీ శక్తి'కి పెద్దపీట వేయాలని, 'పేదల సేవలో' నిరంతరం శ్రమించాలని, 'తెలుగు జాతి విశ్వఖ్యాతి' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ ఉండాలని ఆకాంక్షిస్తున్నా. 'కార్యకర్తే అధినేత'గా మారాలనే నూతన మార్గదర్శకాలతో, ఇనుమడించిన ఉత్సాహంతో మనం ముందుకు సాగాలి. అదే నా ఆశ.. ఆకాంక్ష" అని చంద్రబాబు 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు.

"ఎన్టీఆర్ పార్టీ పెట్టిన ముహూర్త బలం గొప్పది. కార్యకర్తలే పార్టీకి బలం, బలగం. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పోరాడే కార్యకర్తలు నాకు నిత్య స్ఫూర్తి. నేటి నుంచి ప్రారంభం అవుతున్న పసుపు పండగ మహానాడుకు అందరికీ ఘన స్వాగతం పలుకుతున్నాను" **- నారా లోకేశ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి**

## అలుపెరగని శ్రామికుడు చంద్రబాబు: పల్లా శ్రీనివాసరావు



కడప: తెదేపా మహానాడు కడపలో అట్టహాసంగా ప్రారంభమైంది. పార్టీ జెండా ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలనతో ప్రతినిధుల సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రసంగించారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంటే ఉన్నతస్థాయికి వెళ్లవచ్చని పేర్కొన్నారు. "అలుపెరగని శ్రామికుడు చంద్రబాబు. ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా నిలబడి పోరాడారు. కార్యకర్తలకు ఎప్పుడూ పార్టీ అండగా ఉంటుంది. యువగళం ద్వారా పార్టీకి లోకేశ్ కొత్త శక్తి ఇచ్చారు. చంద్రబాబు, లోకేశ్‌ను చూసి క్రమశిక్షణ నేర్చుకోవాలి" అని పల్లా పిలుపునిచ్చారు.

## టీడీపీ జెండా.. తెలుగు జాతికి అండ: అచ్చెన్నాయుడు



అమరావతి, మే 27: తెలుగుదేశం జెండా.. తెలుగు జాతికి అండ అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు వేదికపై మంత్రి మాట్లాడుతూ.. తెలుగు ప్రజల కోసం, తెలుగు రాష్ట్రాల ప్రగతి కోసం టీడీపీ కృషి చేస్తుందన్నారు. పౌరుషాల గడ్డ కడపలో పసుపు జెండా సత్తా చూపించేందుకు తెలుగు దండు కదం తొక్కిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ చారిత్రాత్మక మహానాడు ఈసారి కడపలో ఘనంగా జరుగుతోందన్నారు. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు నేత నారా లోకేష్ అని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. వైసీపీ భూస్థాపితం అయిపోయిన పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి రాజకీయ భవిష్యత్తు లేదన్నారు. మద్యం, ఇసుక, మైనింగ్ కుంభకోణాలతో జగన్ అండ్ కో టీమ్ ప్రజా సంపద దోచుకుందని ఆరోపించారు. వస్తున్నా మీ కోసం అని నాడు చంద్రబాబు భరోసా ఇచ్చారుని.. యువగళం పేరుతో తెలుగు ప్రజలకు నారా లోకేష్ అండగా నిలిచారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## కొడాలి నాని ఆరోగ్యం.. కుటుంబ సభ్యుల్లో ఆందోళన

గుడివాడ : మాజీ మంత్రి కొడాలి నానికి ఇటీవల సర్జరీ జరిగింది. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది కలిస్తే.. ఆయనకు ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశముందని కొడాలి నాని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కొడాలి నాని కుటుంబ సభ్యుల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకొని వైసీపీ శ్రేణులు, అభిమానులు దయ చేసి ఆయనను కలిసేందుకు హైదరాబాద్ రావద్దని వైసీపీ నేత దుక్కిపాటి శశిభూషణ్ పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో సన్నిహిత మిత్రుడు కుమారుడి రిసెప్షన్‌కు కొడాలి నాని తప్పని పరిస్థితుల్లో పాల్గొనడం జరిగిందని ఆయన వివరణ ఇచ్చారు. డాక్టర్ల సూచనల మేరకు కోవిడ్ దృష్ట్యా.. సర్జరీ తరువాత కొడాలి నానికి ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉన్నందున దయ చేసి పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనను కలిసేందుకు హైదరాబాద్ రావద్దని కోరారు. మరో రెండు నెలల్లో కొడాలి నాని పార్టీ శ్రేణులతోపాటు అభిమానులకు అందుబాటులో ఉంటారని వైసీపీ నేత శశి భూషణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ మేరకు వైసీపీ నేత దుక్కిపాటి శశిభూషణ్ పేరుతో మంగళవారం పత్రిక ప్రకటన వెలువడింది.



## మాజీ ఎమ్మెల్యే ఆర్కేపై సీఐడీ కేసు నమోదు

అమరావతి, మే 27: తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడి కేసులో ఆయన పేరును 127వ ముద్దాయిగా సీఐడీ పోలీసులు చేర్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అంటే.. 2021, అక్టోబర్ 19వ తేదీన మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంపై వైసీపీ అరాచక మూకలు దాడికి తెగబడ్డాయి. అయితే కూటమి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం ఈ దాడి కేసును సీఐడీకి అప్పగించింది.




కడప: ఉరసా సంస్థకు 99 పైసలకు ఎకరా భూమి ఇచ్చినట్టు జగన్ నిరూపిస్తే.. రాజీనామాకు తాను సిద్ధమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సవాల్ చేశారు. టీసీఎస్‌కు 99 పైసలకు ఇచ్చాం, ఉరసాకు మార్కెట్ ధరకే భూములు ఇచ్చామని తెలిపారు. విశాఖలో 5లక్షల ఉద్యోగాలు కల్పిస్తే ఇక విశాఖ నగరాన్ని అందుకోలేమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో చేస్తోందని వ్యాఖ్యానించారు. మద్యం కుంభకోణంలో జగన్ వైఖరి దొంగే.. దొంగ దొంగ అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ఇక పరిశ్రమలు వస్తాయే కానీ.. ఒక్కటి కూడా బయటకు పోదని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోవటానికి ఏపీలో ఇప్పుడు వైకాపా ప్రభుత్వం లేదన్నారు. పార్టీ తనకు ఏ బాధ్యత అప్పగించినా నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన అందరికీ పదవులు వస్తాయని, పదవులు రాలేదని నేతలు అలకబూనడం మానేయాలని హితవు పలికారు. తాను విద్యాశాఖ మంత్రి అయ్యాక ఏపీలో ఏ ఒక్క పాఠశాల కూడా మూసివేయలేదన్నారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని వైకాపా నేతలు కళ్లు తెరిచి చూడాలన్నారు.




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సినిమాహాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టి, ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. తాజాగా సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్.. సినిమాలు హాళ్ల బంద్ ప్రకటన, ఈ క్రమంలో తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పలు కీలక సూచనలు చేశారు.

**'హరిహర వీరమల్లు'కు అలాగే చేయండి...** కొత్త చిత్రాల విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. టికెట్ ధరల పెంపు, సినిమా హాళ్ల నిర్వహణ సహా ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను, పర్యవేక్షణను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. త్వరలో విడుదలయ్యే 'హరిహర వీరమల్లు' సినిమాకు సైతం టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి, సంప్రదింపులు చేయాలని ఇందులో ఎలాంటి బేధాలు పాటించవద్దు అని స్పష్టంగా చెప్పారు.

**తినుబండారాల ధరలపై విచారణ చేపట్టండి...** టికెట్ ధర కంటే సినిమా హాల్లో పాప్‌కార్న్ సహా ఇతర తినుబండారాలు, శీతల పానీయాలు, చివరకు మంచి నీళ్ల సీసాల ధరలు సైతం భారీగా ఉండటంపై ఈ సందర్భంగా చర్చించారు. వాటి వాస్తవ ధరలు.. ప్రస్తుతం ఎంతకు విక్రయిస్తున్నారు.. అసలు వాటిలో ఉండే నాణ్యత ప్రమాణాలు ఏమిటనేది కూడా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్స్‌లో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలోనూ గుత్తాధిపత్యం సాగుతోందనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాలుకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని అభిప్రాయపడ్డారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్యా పెరిగి, పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం మెరుగవుతుందన్నారు. ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు.

**జనసేన వాళ్లు ఉన్నా వదలొద్దు...** తెలుగు చిత్ర రంగంలో సినిమా హాళ్ల బంద్ ప్రకటన వెలువడటానికి నేపథ్యం, ఆ నలుగురు ప్రమేయం, తమకు సంబంధం లేదని ఇద్దరు నిర్మాతలు ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లాలోనే తొలుత బంద్ ప్రకటన వెలువడటం.. తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వివరించారు. బంద్ ప్రకటన వెనక జనసేన నాయకుడు ఉన్నారని, ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు.

ఈ ప్రకటన వెనక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉందని, సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలోనూ విచారణ చేయించాలని మంత్రి దుర్గేష్‌కు పవన్ కల్యాణ్ సూచించారు.

**బెదిరింపు ధోరణి పనికిరాదు...** సినిమా రంగంలో అవాంఛనీయమైన పరిస్థితులకు కారణమైన బంద్ ప్రకటన వెనకగల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఇందుకు కారకుల్లో జనసేన వాళ్లు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దన్నారు. నిర్మాతలు, నటులు, దర్శకులు బెదిరింపుల ద్వారా వ్యాపారాలు సాగించాలనుకొనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వొద్దన్నారు. సినిమా వ్యాపారం సజావుగా సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకు వస్తుందన్న విషయాన్ని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి, నిర్మాతల మండలికి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, దర్శకుల సంఘాలకు తెలియజేయాలన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకురానున్న సినీ పరిశ్రమ సమగ్రాభివృద్ధి పాలసీ కోసం తెలుగు సినిమా రంగంలోని సంఘాలు, మండళ్ల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.




## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్ పొడిగింపు

అమరావతి: ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసు నిబంధనల ఉల్లంఘనపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం అతన్ని సస్పెండ్ చేసింది. సంజయ్‌పై వచ్చిన అభియోగాల విచారణపై ఏర్పాటైన కమిటీ సిఫార్సులతో 2024 డిసెంబరు 3న సస్పెండ్ చేస్తూ ఆదేశాలు వెలువరించింది.

ఆ తర్వాత సస్పెన్షన్‌ను 2025 మే 31 వరకు పొడిగించింది. ఆ సస్పెన్షన్‌ను ఈ ఏడాది నవంబర్ వరకు మరోసారి పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

## వంశీ కస్టడీపై విచారణ.. నూజివీడు కోర్టు ఏం చెప్పిందంటే



విజయవాడ, మే 27: మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ కస్టడీ పిటిషన్‌పై నూజివీడు కోర్టులో ఈరోజు (మంగళవారం) విచారణ జరిగింది. వంశీ అస్వస్థతకు గురికావడంతో సరిగా విచారణ జరగలేదని కోర్టుకు పోలీసులు తెలిపారు. దీంతో రెండు రోజుల్లో ఏం విచారణ చేశారో చెప్పాలని పోలీసులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో మూడు రోజుల పాటు వంశీని కస్టడీకి ఇవ్వాలంటూ నూజివీడు కోర్టులో హనుమాన్ జంక్షన్ పోలీసులు రెండో సారి పిటిషన్ వేశారు. దీనిపై ఈరోజు విచారణ జరుగగా.. గతంలో రెండు రోజులు ఇదే కేసులో కస్టడీకి తీసుకొని విచారణ చేశారని వంశీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే ఆ రెండు రోజులు వంశీ అస్వస్థతకు గురవడంతో సరిగా విచారణ జరగలేదని కోర్టుకు తెలియజేశారు పోలీసులు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం... రెండు రోజుల్లో ఏం విచారణ చేశారో తెలపాలని పోలీసులను ఆదేశించింది. విచారణ అనంతరం నూజివీడు కోర్టు నిర్ణయాన్ని వెలువరించనుంది. మరోవైపు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని హైకోర్టులో వంశీ పిటిషన్ వేశారు. అయితే అత్యవసరంగా విచారించలేమని.. ఈనెల 29న (గురువారం) విచారణ చేపడుతామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా.. వంశీ ఇప్పటికే పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ప్రధానంగా గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి కేసు, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుకు సంబంధించి విజయవాడ కోర్టులో వంశీకి బెయిల్ మంజూరు అయిన విషయం తెలిసిందే. అయితే నూజివీడు కోర్టులో తాజాగా ఓ కేసు నమోదు అయ్యింది. అందులో వంశీ రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్నారు. 2019 ఎన్నికల సమయంలో పేదలకు నకిలీ ఇళ్ల పట్టాలు అందజేసి మోసం చేశారంటూ వంశీపై అభియోగాలు నమోదు అయ్యాయి. దీనికి సంబంధించి రెండు రోజుల పాటు కస్టడీకి కోరగా.. న్యాయాధికారి అందుకు అంగీకరించారు. కానీ కస్టడీలో ఉన్న సమయంలో వంశీ అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ క్రమంలో వంశీ అనారోగ్యం కారణంగా విచారణకు సహకరించలేదని పోలీసులు చెబుతున్నారు. దీంతో మరోసారి వంశీని కస్టడీకి కోరుతూ నూజివీడు కోర్టులో పోలీసులు పిటిషన్ వేశారు. ఈ రెండు రోజుల్లో వంశీ ఎలాంటి సమాచారం ఇచ్చారు అనే దానిపై నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఇదే సమయంలో తన అనారోగ్య కారణాల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో వంశీ పిటిషన్ వేశారు. దీనిపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అయితే అత్యవసరంగా విచారణ చేయలేమంటూ హైకోర్టు న్యాయమూర్తి గురువారానికి ఈ కేసు విచారణను వాయిదా వేశారు. ఇరువురి వాదనలు విన్న తర్వాత హైకోర్టు తీర్పు ఇచ్చే అవకాశం ఉంది. ఓవైపు బెయిల్ కోసం వంశీ తీవ్రంగా ప్రయత్నిస్తుండగా.. వంశీని కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

# అందాల సిమ్రాన్ వయ్యారాలు చూశారా..!

ఈ నగరానికి ఏమైంది సినిమాతో తెలుగు సినీ ప్రేక్షకులకు దగ్గర అయిన ముద్దుగుమ్మ సిమ్రాన్ చౌదరి. 2018లో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు మోడలింగ్‌లో మంచి పేరు సొంతం చేసుకుంది. ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2017 గెలుచుకోవడం ద్వారా ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించింది. అందంతో పాటు అభినయం ఈ అమ్మడి సొంతం. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో సిమ్రాన్‌కి ఆఫర్లు ఆశించినంతగా రాలేదు. మెయిన్ లీడ్ కోసం వెయిట్ చేయకుండా వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకుంటూ వచ్చింది. ఈ అమ్మడు తెలుగులో చేసిన సినిమాల్లో ఎక్కువ శాతం చిన్న సినిమాలు, కాన్సెప్ట్ ఓరియంటెడ్ సినిమాలు కావడం విశేషం. హైదరాబాద్‌లో పెరిగిన ఈ అమ్మడు డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివింది. పాఠశాల విద్యను హైదరాబాద్‌లోనే పూర్తి చేసి సెయింట్ ప్రావిన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. మిస్ టాలెంటెడ్ టాలీవుడ్ మిస్ హైదరాబాద్ టైటిల్‌ను గెలుచుకున్న సిమ్రాన్ చౌదరి ఇండస్ట్రీలో మాత్రం ఆశించిన స్థాయిలో ఆఫర్లు సొంతం చేసుకోలేక పోయింది. 2014లో హమ్‌తుమ్ సినిమాలో చిన్న పాత్రలో కనిపించడం ద్వారా వెండి తెరపై అడుగు పెట్టింది. మొదటి సినిమా తో పెద్దగా గుర్తింపు దక్కించుకోలేక పోయిన ఈమె ఈ నగరానికి ఏమైంది సినిమాలో మాత్రం మంచి గుర్తింపు దక్కించుకుంది. ప్రేక్షకుల్లో నోటెడ్ కావడం జరిగింది. సినిమాల్లో అడపా దడపా కనిపిస్తూ వస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను



షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా ఆరున్నర లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈమె రెగ్యులర్‌గా తన అందమైన ఫోటో షూట్ ఫోటోలను, వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. తద్వారా సినిమాలతోనే కాకుండా ఇలా ఫోటో షూట్స్‌తోనూ గుర్తింపు దక్కించుకుంది. సిమ్రాన్ చౌదరి కెరీర్‌లో చాలా ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది. తెలుగు మూలాలు ఉన్న అమ్మాయి అనే ట్యాగ్ లేకున్నా కూడా ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు అంటూ ఆమె సన్నిహితులు, ఫాలోవర్స్ ఆవేదన వ్యక్తం చేస్తూ ఉంటారు. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వయ్యారాలు పోతూ సిమ్రాన్ అందాల ఫోటో షూట్‌ను షేర్ చేసి ఆకట్టుకుంది. చూపు తిప్పనివ్వని ఈ అమ్మడి ఫోటోలు ఎప్పటిలాగే నెట్టింట వైరల్ అవుతున్నాయి. నడుము అందం చూపిస్తూ బ్లూ జీన్స్‌లో మినీ టీ షర్ట్ ధరించి సిమ్రాన్ కన్నుల విందు చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఉన్న ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటోల కారణంగా అయినా ఇండస్ట్రీలో ఈమె మరింత బిజీ అవుతుందా అనేది చూడాలి. ఇప్పటి వరకు ఈమె పెద్ద సినిమాల్లో ఆఫర్లు దక్కించుకోలేక పోయింది. ఒకవేళ సిమ్రాన్ కనుక ఒక్క పెద్ద సినిమాలో అవకాశం దక్కించుకుంటే తప్పకుండా బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయని ఈమె ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అయ్యే వారు అంటూ ఉంటారు. మరి ఆ అవకాశం ఎప్పుడు వస్తుంది అనేది చూడాలి.

# ప్రేమలు బ్యూటీ ఖాతాలో మరోటి..!

ప్రేమలు సినిమాతో సౌత్ ఆడియన్స్ మనసులు గెలిచేసింది క్యూట్ బ్యూటీ మమితా బైజు. ఆ సినిమాకు ముందు కూడా అమ్మడు మలయాళంలో సినిమాలు చేసినా కూడా ప్రేమలు సినిమానే ఎక్కువ ఇంపాక్ట్ చూపించింది. కేవలం మలయాళంలోనే కాదు ఆ సినిమా రిలీజైన ప్రతి చోటా అమ్మడికి ఫ్యాన్స్ ఏర్పడ్డారు. యూత్ ఆడియన్స్ అయితే మమితా నామ జపం చేస్తున్నారు. ముఖ్యంగా తెలుగు ఆడియన్స్ కి మమితా హాలిలిట్ ఫేవరెట్ అయ్యింది. టాలెంట్ ఉన్న వాళ్లకు తెలుగు ఆడియన్స్ హృదయాల్లో చోటిస్తారు. ఒక్కసారి తెలుగు ఆడియన్స్ కి దగ్గరైతే దూరమవడం చాలా కష్టం. ప్రేమలు లాంటి డబ్బింగ్ సినిమాతోనే మమిత తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. ఐతే యూత్ లో ఆమెకు ఉన్న బజ్ చూసి మన మేకర్స్ మమితా బైజుని ఇక్కడ సినిమాల్లోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఐతే ఇప్పటికే తమిళ, మలయాళ సినిమాలతో బిజీగా ఉన్న మమితా



తెలుగు దర్శక నిర్మాతల ఆఫర్లను కాదనేసింది. ఐతే సూర్య వెంకీ అట్లూరి చేస్తున్న సినిమాలో మాత్రం మమితా ఛాన్స్ అందుకుంది. అది తెలుగు, తమిళ్ బైలింగ్వల్ గా వస్తుంది కాబట్టి మమితా మొదటి తెలుగు సినిమా అదే అని ఫిక్స్ అవ్వొచ్చు. ఇదిలాఉంటే ఇలా సూర్య సినిమా ఓకే చేసిందో లేదో మమితాకు మరో బంపర్ ఆఫర్ వచ్చిందని టాక్. స్టార్ సినిమాలో ఆమెకు అవకాశం దక్కిందట. డేట్స్ అడ్జెస్ట్ చేసుకుని అయినా సినిమాలు చేయాలి కానీ రిజెక్ట్ చేస్తూ పోతే తర్వాత కావాలన్నప్పుడు అవకాశాలు దొరకవని మమితా కి తెలిసి వచ్చింది. అందుకే సూర్య సినిమా ఇలా ముహూర్తం పెట్టగానే మరో తెలుగు సినిమా ఆఫర్ రాగా అది కూడా ఓకే చేసింది. ఇప్పటికే అమ్మడు మైత్రి మేకర్స్ ప్రదీప్ రంగనాథన్ తో చేస్తున్న డ్యూడ్ సినిమాలో ఛాన్స్ అందుకోగా ముచ్చటగా మూడో ఆఫర్ కూడా కొట్టేసిందని తెలుస్తుంది. మొత్తానికి మమితా బైజు మీద ఉన్న క్రేజ్ ని క్యాష్ చేసుకునేందుకు తెలుగు మేకర్స్ ప్రయత్నిస్తున్నారు. డ్యూడ్ తో పాటు సూర్య సినిమా రిలీజ్ అయ్యే సరికి మమితా ఇక్కడ టాప్ రేంజ్ కి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్పొచ్చు. ఆల్రెడీ త్వరలో ప్రేమలు 2 తో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైన మమితా ఈ సినిమాలన్నీ కూడా ఆమె ఫ్యాన్స్ కి ఫుల్ జోష్ తెప్పించడం గ్యారెంటీ అని చెప్పొచ్చు.




# ప్రేమలు 2 కోసం ఫ్యాన్స్ వెయిటింగ్..!




మలయాళం లో తెరకెక్కించ ప్రేమలు సినిమా అక్కడ సూపర్ హిట్ అవ్వడమే కాకుండా తెలుగు, తమిళ భాషల్లో డబ్ అయ్యి ఇక్కడ కూడా మంచి సక్సెస్ అందుకుంది. ముఖ్యంగా తెలుగులో ప్రేమలు సూపర్ హిట్ అయ్యింది. దానికి కారణం సినిమా ఎక్కువ భాగం హైదరాబాద్ లో నడుస్తుంది. అందుకే మన వాళ్లు ఇంకాస్త ఎక్కువ కనెక్ట్ అయ్యారు. అంతేకాదు మమితా బైజు క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ వల్ల యూత్ ఆడియన్స్ అంతా కూడా రిపీటెడ్ గా చూశారు. గిరీష్ %ూణ% డైరెక్ట్ చేసిన ప్రేమలు సినిమాలో నెస్లెన్, మ్యాథ్యూ థామస్, మమితా బైజు, అఖిల ప్రధాన పాత్రల్లో నటించారు. యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా వచ్చిన ఈ సినిమా లాస్ట్ ఇయర్ సూపర్ హిట్ సినిమాల్లో ఒకటిగా చేరింది. 9 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా దాదాపు 80 నుంచి 100 కోట్ల దాకా కలెక్షన్స్ రాబట్టింది. ఐతే ప్రేమలు సినిమా సక్సెస్ అవ్వడమే ఆలస్యం ఆ సినిమాకు సీక్వెల్ గా ప్రేమ 2 అనౌన్స్ చేశారు మేకర్స్. ప్రేమలు సినిమాలో నటించిన జంట నెస్లెన్, మమితా బైజులకు సూపర్ ఫాలోయింగ్ ఏర్పడింది. అంతేకాదు ప్రేమలు 2 కొనాసాగించినా కూడా ఇదే బజ్ ఉంటుందని చిత్ర యూనిట్ కనిపెట్టారు. అందుకే ప్రేమలు 2 మొదలు పెట్టారు. లాస్ట్ ఇయర్ సెకండ్ హాఫ్ లోనే ప్రేమలు 2 మొదలైంది. ఐతే ఇప్పటివరకు ఆ సినిమా షూటింగ్ ఎక్కడివరకు వచ్చిందో అప్డేట్ రాలేదు. సినిమా ఈ ఇయర్ రిలీజ్ ఉంటుందా లేదా అన్న క్లారిటీ కూడా లేదు. ఓ పక్క మమితా బైజు తెలుగు, తమిళ్ లో వరుస సినిమాలు చేస్తూ వస్తుంది. నెస్లెన్ కూడా ఈమధ్యనే తన జింఖానా సినిమాతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ప్రేమలు 2 ఈ ఇయర్ రిలీజ్ ఉంటుందా ఒకవేళ రిలీజ్ ఉంటే ఎప్పుడు వస్తుంది అన్నది తెలియాల్సి ఉంది. ప్రేమలు ఐతే ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి సక్సెస్ అయ్యింది. ప్రేమలు 2 మీద కచ్చితంగా భారీ అంచనాలు ఉంటాయి. మరి వాటిని సినిమా అందుకుంటుందా లేదా అన్నది చూడాలి. ఐతే ప్రేమలు సూపర్ హిట్ కాబట్టి సీక్వెల్ కి మంచి బజ్ ఉంటుంది. అందుకు తగినట్టుగా సినిమా ఉంటే మాత్రం ఈ సీక్వెల్ కూడా రికార్డులను సృష్టించే ఛాన్స్ ఉంటుంది.

# 2025-26 లో వచ్చే పాన్ ఇండియా సినిమాలివేనా!



2025-26 క్యాలెండర్ ఇయర్ లో రిలీజ్ అయ్యే టాలీవుడ్ పాన్ ఇండియా సినిమాలెన్ని? అంటే ప్రముఖంగా కొన్ని చిత్రాలు కనిపిస్తున్నాయి. ఇవి మాత్రం కచ్చితంగా రిలీజ్ అయ్యే చిత్రాలని చెప్పొచ్చు. ఇప్పటికే బాగా ఆలస్యమైన నేపథ్యంలో వీలైనంత త్వరగా రిలీజ్ చేయాలని మేకర్స్ తపిస్తున్నారు. ఓ సారి ఆ చిత్రాల వివరాల్లోకి వెళ్తే... ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తోన్న 'రాజాసాబ్' ఎంత కాలంగా వాయిదా పడు తుందో తెలిసిందే. ఏప్రిల్ రిలీజ్ అనుకున్నారు. కానీ సాధ్య పడలేదు. తాజాగా చిత్రం దసరా రిలీజ్ రేస్ లో కనిపిస్తుంది. సినిమా రిలీజ్ కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ప్రభాస్ మరో చిత్రం 'ఫౌజీ' కూడా వేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటుంది. ఈ చిత్రాన్ని కూడా ఏడాది ముగింపులో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఒకవేళ ఈ ఏడాది సాధ్యం కానీ పక్షంలో వచ్చే ఏడాది ఆరంభంలోనే రెండు చిత్రాలు రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతోన్న 'పెద్ది' రిలీజ్ తేది ప్రకటించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ చేస్తున్నారు. యంగ్ హీరో తేజ సజ్జా నటిస్తోన్న 'మిరాయ్' ఇదే ఏడాది ఆగస్టులో రిలీజ్ సన్నాహాలు చేస్తున్నారు. అప్పటికి అన్ని పనులు పూర్తయితే రిలీజ్ అవుతుంది. లేదంటే? ఏడాది ముగింపు కల్లా ప్రేక్షకుల ముందుకొస్తుంది. 'హరిహరవీరమల్లు' రిలీజ్ నిరీక్షణకు కూడా తెరదించేసారు. ఎట్టకేలకు జూన్ 12న రిలీజ్ అవుతుంది. మరో వాయిదా ఛాన్స్ తీసుకునే అవకాశమైతే లేదు. పవన్ కళ్యాణ్ నటిస్తోన్న మరో చిత్రం 'ఓజీ' కూడా ఏడాది ముగింపులో గానీ వచ్చే ఏడాది గానీ రిలీజ్ అవుతుంది. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశలో ఉంది.

నటసింహ బాలకృష్ణ నటిస్తోన్న 'అఖండ2' పాన్ ఇండియా లో భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ లో రిలీజ్ అవుతుంది. ఆ తేదీ మిస్ అయితే అక్టోబర్ రిలీజ్ తప్పనిసరి. యంగ్ టైగర్ ఎన్టీర్ బాలీవుడ్ డెబ్యూ 'వార్ 2' భారీ అంచనాల మధ్య ఆగస్టులో రిలీజ్ అవుతుంది. తెలుగు సినిమా కాకపోయినా తారక్ ఎంట్రీతో 'వార్ 2' టాలీవుడ్ చిత్రంగా మారిపోయింది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తోన్న 'కూలీ' ఆగస్టులో రిలీజ్ అవుతుంది. కన్నడ స్టార్స్ యశ్ నటిస్తోన్న 'టాక్సిక్' వచ్చే ఏడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకొస్తుంది. రిషబ్ శెట్టి స్వీయా దర్వకత్వంలో తెరకెక్కుతోన్న కాంతార చాప్టర్ 1 అక్టోబర్ లో రిలీజ్ అవుతున్నాయి.

# మమితా-కయాదు మధ్యలో కేతిక తన్నుకుపోయిందా?

ఒక హీరోయిన్ అవకాశం మరో హీరోయిన్ తన్నుకుపోవడం సహజమే. కొన్నిసార్లు హీరోయిన్ల అలసత్వం కారణమైతే మరికొన్ని సార్లు మేకర్ల నిర్ణయాల కారణంగా రాత్రికి రాత్రే హీరోయిన్లు మారిపోతుంటారు. తాజాగా రవితేజ కొత్త చిత్రం విషయంలో అదే జరిగినట్లు కనిపిస్తుంది. రవితేజ్ హీరోగా కిషోర్ తిరుమల ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే స్టోరీ లాక్ అయింది. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగు తున్నాయి. ఇందులో ఇద్దరు నాయికలకు అవకాశం ఉండగా? వాటి కోసం కయదా లోహార్, మమితా బైజులను పరిశీలిస్తున్నారు. వాళ్లతో టీమ్ డిస్కషన్స్ కూడా షురూ చేసింది.



వాళ్లిద్దరిలో ఒకరు మెయిన్ లీడ్ కి..మరొకరు సెకెండ్ లీడ్ కి ఎంపిక అవ్వాల్సి ఉంది. అయితే ఇప్పుడా ఇద్దరి మధ్యలో మెయిన్ లీడ్ ఛాన్స్ కేతిక శర్మ తన్నుకుపోయింది. మేకర్స్ అమెను ఫైనల్ చేసినట్లు సన్నిహితుల నుంచి తెలిసింది. కేతికతో అన్ని రకాల అగ్రిమెంట్లు చేసుకున్నట్లు సమాచారం. జులై నుంచి రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలవుతుందని తెలిసింది. వాస్తవానికి కేతిక పేరు ఈ ప్రాజెక్ట్ ప్రచారంలోనే లేదు. తొలి నుంచి కయాదు లోహర్, మమితా బైజు పేర్లే బలంగా వినిపించాయి. కానీ ఈ సన్నివేశం రాత్రికి రాత్రే మారిపోయింది. కేతిక పేరు పరిశీలనలోకి రాగానే అమ్మడు చక్రం తిప్ప ప్రాజెక్ట్ చేజిక్కుచుకుంది. దీనికి సంబంధించి మేకర్స్ నుంచి అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది. ఇటీవలే కేతిక శర్మ 'సింగిల్' సినిమాతో మంచి విజయం అందుకుంది. 'రొమాంటిక్' సినిమాతో కేతిక టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. అటుపై కొన్ని సినిమాలు చేసినా కలిసి రాలేదు.'సింగిల్' తో మళ్లీ బౌన్స్ బ్యాక్ అయింది. ఆ క్రేజ్ తోనే ఛాన్స్ అందుకుంది.

# 50 వయసులో దడ పుట్టిస్తున్న సుష్!

1994లో మిస్ యూనివర్స్ కిరీటాన్ని గెలుచుకున్న సుష్మితా సేన్ ఆ తర్వాత నటనలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కింగ్ నాగార్జున సరసన రక్షకుడు (1996) చిత్రంలోకథానాయికగా నటించింది. అదే ఏడాదిలో దస్తక్‌తో హిందీ సినిమాల్లోకి ప్రవేశించింది. బివి నంబర్ 1, ఫిల్హాల్, మై హూ నా వంటి చిత్రాలలో తన బలమైన పాత్రలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకుంది. అందాల రాణిగా కిరీటం అందుకున్న సిస్మితాసేన్ బహుముఖ ప్రజ్ఞావంతురాలు. అయితే సుస్మితాసేన్ ప్రతిసారీ ఎఫైర్ మ్యాటర్స్ తో మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చింది. ప్రేమాయణాలు, బ్రేకప్ లు సుష్ కి కొత్తేమీ కాదు. లైఫ్ లో పెళ్లి మ్యాటర్ ఎత్తకుండా డేటింగులతో టైమ్ స్పెండ్ చేసిన సుస్మితాసేన్ చివరిగా మోడల్ రోహ్మన్ షాల్ తో డేటింగ్ చేసింది. ఆ తర్వాత బిజినెస్ మేన్, ఐపీఎల్ ఫౌండర్ లలిత్ మోడీతో డేటింగులో ఉన్నానని ప్రకటించినా కానీ, ఇంతలోనే అది బ్రేకప్ అయింది. ఇటీవల జియో హాట్‌స్టార్‌లో ప్రసారం అవుతున్న %ాు% సిరీస్ ఆర్యతో



సుష్ నటిగా తిరిగి వచ్చింది. తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి ప్రమాదకరమైన నేరాల ప్రపంచాన్ని ఢీకొట్టే తల్లిగా తన పాత్ర విమర్శకుల ప్రశంసలను పొందింది. ఆర్యతో నటనలోకి రీఎంట్రీ అదరగొట్టేయడమే కాకుండా ప్రతిష్ఠాత్మక ఎమ్మీ అవార్డులలో నామినేషన్ సహా అంతర్జాతీయ గుర్తింపును కూడా పొందింది. సుస్మితాసేన్ ఎప్పటికీ స్టైల్ ఐకాన్‌గా అభిమానుల హృదయాల్లో నిలిచి ఉంది. ఏదైనా రెడ్ కార్పెట్ ఈవెంట్ అయినా, పబ్లిక్ ఈవెంట్ అయినా సుస్మితాసేన్ లుక్ గురించి చర్చ సాగుతుంది. తాజాగా సుస్మిత బ్లాక్ కలర్ డిజైనర్ శారీలో ప్రత్యక్షమైంది. ఈ డిజైనర్ లుక్ యువతరం గుండెల్లో గుబులు రేపింది. అయితే సుస్మితాసేన్ వయసు 50. ఈ వయసులోను 20 మైనస్ అమ్మాయిలా కనిపిస్తూ సుష్ గుబులు పెంచుతోంది. ప్రస్తుతం ఈ బ్లాక్ శారీ లుక్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.




## హైదరాబాద్ లో ట్రాఫిక్ కష్టాలు.. సీఎం రేవంత్ సంచలన నిర్ణయం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఓ మెట్రోపాలిటన్ సిటీ. నిత్యం ట్రాఫిక్, వాహనాల రద్దీ కారణంగా నగర వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ లో మెట్రో రైలు సదుపాయం ఉన్నా రద్దీ మాత్రం రోజురోజుకూ పెరిగిపోతోంది. నగరవాసుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం పలు ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లు నిర్మిస్తోంది. ఈ క్రమంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ లోని ఐటీ కారిడార్ లో నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ కారణంగా సమయానికి కార్యాలయాలకు చేరుకోవడంలో ఐటీ ఎంప్లాయిస్ కు ఆలస్యం అవుతోంది. ఈ క్రమంలో ఐటీ కారిడార్ లో ట్రాఫిక్ కష్టాలు త్వరలో తీరనున్నాయి. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వంతెన ప్రారంభానికి రంగం సిద్ధమైంది. జూన్ మొదటి వారంలో ఫ్లైఓవర్ ప్రారంభం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఐటీ కారిడార్ ఉద్యోగులకు గుడ్ న్యూస్. జూన్ మొదటి వారంలో ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ మధ్య ఉన్న ఫ్లై ఓవర్ ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు వంతెన ప్రారంభానికి ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇది మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ అని స్పష్టం చేశారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి వద్ద ట్రాఫిక్ రద్దీ పూర్తిగా తగ్గనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ లో ట్రాఫిక్ ను తగ్గించడం కోసం ఇటీవల అంబర్ పేట ఫ్లైఓవర్ ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను మే 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. మొత్తం 1.7 కిలోమీటర్ల పొడవు ఉంది. నాలుగు లేన్లతో కలిసి ఉంది అంబర్ పేట ఫ్లైఓవర్.

ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.335 కోట్లు ఖర్చయినట్లు సమాచారం. అంతకుముందు జనవరిలో ఆరాంఘర్ ఫ్లైఓవర్ ను ప్రారంభించింది తెలంగాణ ప్రభుత్వం. సీఎం రేవంత్ దీన్ని ప్రారంభించారు. రూ. 799కోట్లతో ఈ ఫ్లైఓవర్ ను జీహెచ్ఎంసీ నిర్మించింది. ఆరాంఘర్ చౌరస్తా నుంచి నెహ్రూ జూ పార్క్ వరకు మొత్తం 6 లేన్లు, 4.8 కిలోమీటర్లు, 23 మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ ను నిర్మించారు.

## జూన్ 2న కవిత కొత్త పార్టీ ప్రకటన

హైదరాబాద్ : తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనమైంది. ఈ లేఖపై ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతలు తమదైన శైలిలో వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. అలాంటి వేళ మెదక్ ఎంపీ , బీజేపీ నేత రఘునందన్ రావు మరోసారి స్పందించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తండ్రి, కుమార్తెల మధ్య మధ్యవర్తులెందుకు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. జూన్ 2వ తేదీన కవిత కొత్త పార్టీ రాబోతోందని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం తెలంగాణలో కవిత పాదయాత్ర చేస్తారని ప్రకటించారు. కవిత గెలిచినప్పుడు కేసీఆర్ దేవుడయ్యారని.. మరి ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారంటూ ఎంపీ రఘునందన్ సందేహం వ్యక్తం చేశారు. దెయ్యాల మధ్య పదేళ్ల రాజకీయం ఎందుకు? చేసినట్లు అంటూ కవితకు ఈ సందర్భంగా బీజేపీ రఘునందన్ చురకలంటించారు. ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ రజతోత్సవ సభ వరంగల్‌లో నిర్వహించారు. ఈ సభకు పార్టీ నేతలతోపాటు కార్యకర్తలంతా భారీగా తరలి వచ్చారు. అనంతరం ఈ సభలో తన తండ్రి కేసీఆర్ ప్రసంగంతోపాటు కొన్ని అంశాలతో కూడిన లేఖను ఆయనకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రాశారు. అయితే ఈ లేఖ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ లేఖను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు తమదైన శైలిలో




విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ తర్వాత కేసీఆర్‌తో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ వరుసగా సమావేశమవుతున్నారు. మరోవైపు.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ రిజర్వాయర్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ కేసీఆర్‌తోపాటు హరీష్ రావు, ఈటల రాజందర్‌లకు నోటీసులు జారీ అయ్యాయి. జూన్ 5వ తేదీన కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ బీఆర్ఎస్ చీఫ్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ టాపిక్ డైవర్షన్ కోసమే ఈ లెటర్ పాలిటిక్స్ అనే ఓ చర్చ సైతం రాష్ట్రంలో కొనసాగుతోంది.

## నిరుద్యోగులకు శుభవార్త తెలిపిన మంత్రి సీతక్క



తెలంగాణలోని నిరుద్యోగులకు మంత్రి సీతక్క శుభవార్త తెలిపారు. ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా జూన్ 2న లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని వెల్లడించారు. రూ. లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా రేవంత్ ప్రభుత్వం ఎంపికైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే.. మరో వైపు స్వయం ఉపాది అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. మొదటి విడతలో రూ. లక్ష లోపు యునిట్లకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందని, దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులంతా రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు.

నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాసం నిలుస్తోందని, బడుగు బలహీన వర్గాలు, పేద యవత జీవితాల్లో రాజీవ్ యువ వికాసం వెలుగులు నింపనుందని వ్యాఖ్యానించారు.

## వైరా మాజీ ఎమ్మెల్యే కన్నుమూత.. ప్రముఖుల సంతాపం



ఖమ్మం, మే 27: వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ కన్నుమూశారు. నాలుగు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే ఈరోజు (మంగళవారం) గుండెపోటు రావడంతో మాజీ ఎమ్మెల్యే తుదిశ్వాస విడిచారు. 2014 సెంబ్లీ ఎన్నికల్లో వైరా నుంచి వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు మదన్ లాల్. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇంఛార్జిగా మదన్ లాల్ ఉన్నారు. మదన్ లాల్ మృతిపట్ల మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు సంతాపం తెలియజేశారు. ఖమ్మం జిల్లా వైరా మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బానోత్ మదన్ లాల్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. మదన్ లాల్ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని విచారం వ్యక్తం చేశారు. మదన్ లాల్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## మరోసారి పాక్ పరువు తీసేసిన ఒవైసీ.. ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ పై సెటైర్లు..

భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ దెబ్బకు కాళ్లబేరానికి వచ్చి కాల్పుల విరమణ ఒప్పందం కుర్చుంది పొరుగు దేశం పాక్. పోరాడే సత్తా లేక తోక ముడిచినా సీజ్ ఫైర్ తర్వాత మేకపోతు గాంభీర్యాలు పోతూనే ఉంది. మోసపూరిత ప్రకటనలతో అంతర్జాతీయంగా నవ్వులపాలవుతున్నా ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదు. తాజాగా పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు ఓ చిత్రాన్ని బహూకరించారు. ‘ఆపరేషన్ బున్యాన్’ సమయంలో ఇండియాపై దాడికి సంబంధించిన చిత్రమని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ‘ఆపరేషన్ సిందూర్’ పేరిట భారతదేశం సైనిక చర్య చేపట్టగా.. దాయాది దేశం కూడా ‘ఆపరేషన్ ‘బున్యన్ అల్%–%మర్సుస్’ అంటూ తమ సైనిక చర్యకు పేరుపెట్టింది. ఈ నకిలీ ఫోటోపై %హా×వీ×వీ% అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ‘నకల్ కర్నే కే లియే అకల్ చాహియే’(కాపీ కొట్టడానికైనా తెలివితేటలు అవసరం) అని తీవ్ర విమర్శలు గుప్పించారు.

**వాళ్ళు జోకర్లు.. ఒవైసీ హాట్ కామెంట్స్..** పాకిస్థాన్ కుటిల నీతిని అంతర్జాతీయంగా ఎండగట్టేందుకు భారత ఎంపీ ప్రతినిధి బృందాలు విదేశాల్లో పర్యటిస్తున్నాయి. ప్రస్తుతం కువైట్‌లో పర్యటిస్తున్న బృందంలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కువైట్‌లోని ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. ఈ సందర్భంగా పాక్ ఆర్మీ చీఫ్ ఫేక్ మెమెంటో అంశాన్ని ప్రస్తావించారు. భారతదేశంతో పోటీ పడేందుకు పాకిస్థాన్ హాస్యాస్పదమైన పనులు చేస్తోందని ఎగతాళి చేశారు. ‘నిన్న పాకిస్థాన్ ప్రధాని ఆర్మీ చీఫ్‌కు ఒక ఫోటోను బహుమతిగా ఇచ్చారు. ఈ మూర్ఖులు భారతదేశంతో పోటీ పడాలని కలలు కంటున్నారు. 2019లో చైనా ఆర్మీ డ్రిల్ చిత్రాన్ని షేర్ చేసి అది భారతదేశంపై విజయం అని ప్రచారం చేసుకుంటున్నారు. పాక్ చెప్పేవనీ అబద్ధాలే.. వాళ్ళ ఆలోచన చూడండి ఎలా ఉందో.. కాపీ కొట్టడానికి కూడా అర్హత లేని స్టుపిడ్ జోకర్స్.. ‘నకల్ కర్నే కే లియే అకల్ చాహియే’(కాపీ కొట్టడానికైనా తెలివితేటలు అవసరం) కదా అంటూ సెటైర్లు వేశారు. పాక్ ఏం చెప్పినా నమ్మొద్దు’ అని అన్నారు. ‘ఆపరేషన్ సిందూర్’ తర్వాత పాకిస్థాన్ భారతదేశంపై వందల కొద్దీ డ్రోన్లు, మిస్సైల్స్ ప్రయోగించినా.. మన సైన్యం అన్నింటినీ విజయవంతంగా తిప్పికొట్టింది. పాక్ జరిపిన దాడుల వల్ల ఇండియాకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అయినప్పటికీ, కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత భారత్ పై మేం విజయం సాధించామని సంబరాలు చేసుకుంటోంది. తప్పుడు ప్రచారాలు కొనసాగిస్తూనే ఉంది. తాజాగా ఆర్మీ మునీర్‌కు ప్రధాని షహబాజ్ షరీఫ్ ‘ఆపరేషన్ బున్యాన్’కు సంబంధించిన చిత్రం అంటూ ఒక ఫోటోను ప్రెజెంట్ చేశారు. కానీ, ఆ ఫోటో 2019 చైనా రాకెట్ ఆర్టిలరీ డ్రిల్ కు సంబంధించినది.

## మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతున్నారు.. ఖర్గేపై బీజేపీ ఎంపీ ఫైర్



హైదరాబాద్: మోదీ పాలనలో న్యాయవ్యవస్థ బలోపేతం అయిందని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ హయాంలో దేశం ఎకానమీలో పదోస్థానంలో ఉండేదని.. మోదీ పాలనలో 4వ అతిపెద్ద ఎకానమీ దేశంగా ఎదిగిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మూడుసార్లు ఎన్నికల్లో ఓడిపోయిందని.. అయినా ప్రధానిగా మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడమనేది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానంగా చూడాలని తెలిపారు లక్ష్మణ్. గతంలో అంజయ్యకు అవమానం జరిగిందని.. ఇప్పుడు రేవంత్‌రెడ్డికి జరుగుతుందని లక్ష్మణ్ గుర్తుచేశారు. ఇవాళ (మంగళవారం) హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిస్తే చర్చలు ఉంటాయని స్పష్టం చేశారు. కొంతమంది ఆపరేషన్ సిందూర్‌ను, ఆర్మీని అవమానించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాసిందని తెలుస్తోందని అన్నారు లక్ష్మణ్. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఈటల రాజేందర్ నోటీసులకు సమాధానం ఇస్తారని లక్ష్మణ్ చెప్పుకొచ్చారు. మల్లికార్జున ఖర్గే 11 ఏళ్ల మోదీ పాలనను పీడకలగా చెప్పడం సరికాదని అన్నారు. ఎమర్జెన్సీని తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అది ఓ పీడకల అని విమర్శించారు. ఓబీసీ రిజర్వేషన్‌ను అడుగు అడుగునా అడ్డుకుంది ప్రతిపక్షనేత రాహుల్ గాంధీనే అని విమర్శించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో చేయలేనిది మోదీ 11 ఏళ్లలో చేశారని అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో దేశం అగ్రస్థానంలో ఉందని లక్ష్మణ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ రూ. 50లక్షల కోట్లలో.. కేవలం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ. 11లక్షల కోట్లను మోదీ కేటాయించారని లక్ష్మణ్ స్పష్టం చేశారు. మోదీ హయాంలో దేశం వందశాతం అభివృద్ధి చెందితే కాంగ్రెస్ హయాంలో 50శాతం కూడా అభివృద్ధి చెందలేదని విమర్శించారు. మోదీ హయాంలో 7.4శాతం జీడీపీ వృద్ధి చెందిందని గుర్తుచేశారు. అతి త్వరలోనే మూడో ఆర్థిక దేశంగా భారతదేశం అవతరించపోతుందని ఉద్ఘాటించారు. ఇప్పటికైనా మల్లికార్జునఖర్గే ఆలోచించి మాట్లాడాలని లక్ష్మణ్ హితవు పలికారు.

## సుక్మా జిల్లాలో 18 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పోలీసుల ఎదుట 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ(పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) బెటాలియన్‌లో చురుకుగా ఉన్న నలుగురితో సహా 18 మంది లొంగిపోయారు. వారిలో 10 మందిపై గతంలో మొత్తం రూ.38 లక్షల రివార్డు ప్రకటించారు. సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ముందు వీరు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నక్సల్ రహిత గ్రామ పంచాయతీ పథకం కింద సాధించిన విజయంగా దీన్ని ఎస్పీ పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో పెద్దఎత్తున మావోయిస్టులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి.



ఈ నేపథ్యంలో వీరు లొంగిపోయినట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: తెలంగాణ జాగృతి నేతలతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో వారితో భేటీ అయ్యారు. సింగరేణి ప్రాంత జాగృతి నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో తాజా పరిణామాలు, జాగృతి తరపున చేపట్టే కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం.




పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్ మోతీ రామ్ జాట్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతడి గురించి పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పర్యాటకులపై ఉగ్రదాడికి ముందు మోతీ రామ్ పహల్గాంలోనే విధులు నిర్వర్తించినట్లు సమాచారం. కేవలం దాడి జరగడానికి ఆరు రోజుల ముందే అతడు అక్కడి నుంచి బదిలీ అయినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సీఆర్పీఎఫ్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్సై)గా పనిచేస్తున్న మోతీ రామ్ జాట్.. 2023 నుంచి దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని పాక్ గూఢచర్య ఏజెంట్లకు అందజేస్తున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో అతడి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో కొంతకాలంగా అతడి సామాజిక మాధ్యమ ఖాతా మీద సీఆర్పీఎఫ్ నిఘా పెట్టింది. దీంతో అతడు గూఢచర్యానికి పాల్పడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే అతడిని నాలుగు రోజుల పాటు కఠినంగా విచారించిన సీఆర్పీఎఫ్ సర్వీసు నుంచి తొలగించింది. అనంతరం మే 21న ఎన్ఐఏకు అప్పగించింది. సోషల్ మీడియాలో పాకిస్థానీ హ్యాండ్లర్లతో మోతీరామ్ సంప్రదింపులు జరిపేవాడని విచారణలో గుర్తించారు. వారి నుంచి అతడు రూ.లక్షల్లో డబ్బు తీసుకున్నాడని, ఆ మొత్తాన్ని భార్య బ్యాంకు ఖాతాకు బదిలీ చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మన సైనిక దళాల సీక్రెట్ ఆపరేషన్లు, భద్రతా మోహరింపులు ఉన్న ప్రాంతాల సమాచారాన్ని అతడు పాక్‌కు చేరవేసినట్లు తేలింది. దీనిపై ఎన్ఐఏ మరింత లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఏప్రిల్ 22న పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత పాక్ గూఢచర్యంపై నిఘా సంస్థలు దృష్టిసారించాయి. ఈ క్రమంలోనే పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరభారతంలోని చాలా చోట్ల పాక్ మద్దతు ఉన్న ఈ స్పై నెట్‌వర్క్ క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com